RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 207 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం, ఫిబ్రవరి, 10, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/-
MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 207 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday, February,10, 2026 | PAGES : 8 RS : 4 /-



## బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయే..

**- మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్న - రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేసిందన్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీజేపీకి లైఫ్‌లైన్ అసదుద్దీన్ ఒవైసీయేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఈరోజు తెరపడు తోంది. ఈనేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ,బీజేపీ నాయ కులు అసదుద్దీన్ ఒవైసీ పేరును ఎన్నిసార్లు తలుచుకుంటారోనని ఎద్దేవా చేశారు. మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ తెల్లారితే అసదుద్దీన్‌నే తలుచుకుంటారని, ఆయనే వారికి దేవుడు అన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్రంగామండిపడ్డారు. మోదీని చూసి ఓటు వేయాలని బీజేపీ నాయకులు చెబుతున్నారని,గల్లీ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధమని ప్రశ్నించారు.మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడు బీజేపీ నేతలు వచ్చి కేంద్రం నుంచి నిధులు తీసుకు వస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులు సహజంగానే వస్తాయని, వీరు తేవడమేమిటని అన్నారు.



## ఆ బుక్ భయం వల్లే ప్రధాని సభకు రావడం లేదు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే రాసిన పుస్తకం అంశంలో భయపడడం వల్లే ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభకు రావడం లేదని రాహుల్ గాంధీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని మోదీ ప్రసంగం లేకుండానే ఆ తీర్మా రాన్ని సభ ఆమోదించిన విషయం తెలిసిందే. ఎంపీల వల్ల ప్రధాని ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, ఎవరైనా మోదిని బెదిరిస్తే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ అన్నారు. గడిచిన గురువారం కొందరు మహిళా ఎంపీలు లోక్‌సభలో ఆందోళన చేపట్టడం వల్ల ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. అమెరికా వాణిజ్య ఒప్పందం అంశంలో భయపడుతున్న ప్రభుత్వం.. బడ్జెట్‌లో చర్చ చేపట్టేందుకు వణుకుతోందని ఇవాళ రాహుల్ విమర్శించారు.




## పరీ పే చర్చ లో దేశ నిర్మాణంపై విద్యార్థులకు మోదీ పాఠాలు

**- వికసిత భారత్ గురించి విద్యార్థులు ఆలోచించడంపై ప్రధాని మోదీ హర్షం**

ఢిల్లీ,: 10,12వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే వికసిత భారత్ నిర్మాణం గురించి ఆలోచిస్తుండటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తు లక్ష్యాలపై యువత దృష్టి సారించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఇవాళ పరీ పే చర్చ 2026 రెండో ఎపిసోడ్‌లో భాగంగా ఆయన దేశవ్యాప్తంగా విద్యార్థులతో ముచ్చటించారు.

ఈ కార్యక్రమంలో తమిళనాడులోని కోయంబత్తూరుతో పాటు పలు ప్రాంతాల విద్యార్థులతో ప్రధాని సంభాషించారు. 2047 నాటికి దేశాభివృద్ధికి దోహదపడాలనే విద్యార్థులఆసక్తిని ఆయన అభినందించారు. ఈసందర్భంగా అభివృద్ధి చెందిన దేశాల పౌరులలో ఉండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. ఇంట్లో భోజనం చేసేటప్పుడు ప్లేటులో ఒక్క మెతుకు కూడా వృథా చేయకుండా తినడం అలవాటు చేసుకోండి. ఇలా దేశంలోని ప్రతి ఒక్కరూ చేస్తే ఎంత ఆహారం ఆదా అవుతుందో ఊహించండి. ఇలాంటి చిన్న పనులే బలమైన, బాధ్యతాయుతమైన భారత నిర్మాణానికి పునాదులు వేస్తాయిః అని మోదీ విద్యార్థులకు వివరించారు.

## శరద్‌పవార్‌కు అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు..



ఢిల్లీ,: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి శరద్‌పవార్ అస్వస్థతకు గురయ్యారు. దాంతో కుటుంబసభ్యులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బారామతి నుంచి పుణెలోని రూబీ హాల్ క్లినిక్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దగ్గు,జలుబుతో ఆయన బాధపడు తున్నారని, శ్వాసతీసు కోవడంలో ఇబ్బందిపడుతున్నారని కుటుంబసభ్యులు తెలి పారు. ఇటీవల శరద్‌పవార్ తమ్ముడి కుమారుడు, మహారాష్ట్ర ఉప ముఖ్య మంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.



## రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యం

**- 420 హామీలు ఇచ్చి ఒక్క హామీనీ అమలు చేయలేదు**
**- మెదక్ పర్యటన అంటూనే వణుకుతున్న రేవంత్**
**- దుబ్బాక ప్రచారంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట,తెలంగాణ దిశ :** రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే విమర్శించారు. 420 హా మీలుఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు. ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారు..కానీ రేవంత్ పాలన అంత తుస్సే అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో హరీశ్‌రావు పర్యటించారు.



## రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే

**- పాలన చేతకాక...హామీలను అటకెక్కించారు**
**- హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం**
**- భూపాలపల్లి ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్**


**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ :** రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలి పెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలి కొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్దాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్ లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు.



## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా**

**ఖమ్మం, ఫిబ్రవరి9,తెలంగాణ దిశ :**రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేనోళ్లు.. ఇప్పుడెట్ల అభివృద్ధి చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు, అధికారంలో ఉన్నప్పుడు దొ ర పోకడ తప్ప పేదోల కష్టాలు తెలుసుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. పంచాయితీల్లో మద్దతు తెలిపనట్లే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రాజమద్దతు తమకు ఉందన్నారు. చివరి రోజు ఆయన సుగిగాలి పర్యటనలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేనని చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స న్న బియ్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా చెల్లిస్తున్నామన్నారు. 'ప్రస్తుతం ఉన్నది దొరల పాలన కాదు.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమ ప్రభు త్వం' అన్నారు.




## మున్సిపల్స్ కు అంతా సిద్ధం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా, పోలింగ్ జరిగే రోజైన ఫిబ్రవరి 11న ఓటర్లు తమ ఓటు హక్కును ఎటువంటి ఆటంకం లేకుండా వినియోగించుకోవడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో స్థానిక సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. పోలింగ్ జరిగే మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, సహకార సంఘాలు, ఇతరప్రభుత్వ రంగ సంస్థలకు సెలవు వర్తిస్తుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు ఆ రోజున సెలవు ప్రకటించాలని ఎస్ఈసీ స్పష్టం చేసింది. చాలా విద్యాసంస్థలను పోలింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేట్ కంపెనీలకు సూచన: సాఫ్ట్‌వేర్ సంస్థలు,షాపింగ్ మాల్స్,ఇతర ప్రైవేట్ పరిశ్రమలలో పనిచేసే సిబ్బందికి కూడా ఓటు వేయడానికి వెసులుబాటు కల్పించాలని, అవసరమైతే వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఎన్నికల సంఘం సూచించింది. కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యతలు: ప్రతి జిల్లాలో సెలవు ప్రకటన అమలును జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఓటర్లు తమ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చేలా అవగాహన కల్పించాలనిఎస్ఈసీఆదేశించింది. సెలవు ప్రకటించకుండా సిబ్బందిని విధులకు హాజరుకావాలని ఒత్తిడి చేసేసంస్థలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశంఉందని అధికారులుహెచ్చరించారు.పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉందని, దానినే అస్త్రంగా చేసుకుని అధికార పక్షానికి బుద్ధి చెబుతామని బీఆర్ఎస్ మొదట్లో ప్రకటనలు చేసింది.

**ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో సెలవు**



## రాజకీయంగా దెబ్బతీసే కుట్ర

పాట్నా,ఫిబ్రవరి 9 : అనుష్కా యాదవ్ అనే మహిళతో తాను రిలేషన్‌షిప్‌లోఉన్నట్లు, ఇప్పుడు ఆమెతో తాను కుమార్తెను కన్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్పెద్ద కుమారుడు, ఆర్జేడీ బహిష్కృత నాయకుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తెలిపారు. ఆర్జేడీ నేతలు తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అనుష్కా యాదవ్ అనే మహిళతో తనకు సంబంధాలు ఉన్నట్లు వస్తున్న వార్త లపై తేజ్ ప్రతాప్ అభ్యంతరం తెలిపారు. ఆధారరహితంగా వదంతులు వ్యాప్తిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచే శారు. ఈ కుట్ర వెనక మహువా నియోజకవర్గ ఆర్జేడీ ఎమ్మెల్యే ముఖే శ్ రోషన్‌ఉన్నాడన్నారు. తన సోద రుడు తేజస్వీ యాదవ్‌కు సన్నిహితు లైన పలువురు ఆర్జేడీ నేతలు తన రాజకీయ జీవితాన్ని దెబ్బతీయడా నికి కుట్ర పన్నుతున్నారని చెప్పారు.

**మహిళతో సంబంధంపై ఆర్జెడి నేత తేజ్‌ప్రతాప్**

# అక్రమ షట్టర్లు... అధికారులు ఎక్కడ..?

## - మలుపు వద్ద సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం, ప్రమాదాలకు ఆహ్వానం
## - డ్రైవర్ల దృష్టి ఆవరణం, ఎదురెదురు ఢీకొనే ప్రమాదం
## - సమీపంలో గురుకుల పాఠశాల... విద్యార్థుల భద్రతపై ఆందోళన...







**నాగారం, ఫిబ్రవరి 09 (తెలంగాణ దిశ):**రహదారి మలుపుల వద్ద సెట్‌బ్యాక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని రోడ్డు భద్రత నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నా, నాగారం డివిజన్‌లో జరుగుతున్న ఒక నిర్మాణం తీవ్ర వివాదానికి దారితీస్తోంది. ఘట్కేసర్ సర్కిల్--6 పరిధిలోని నేతాజీ నగర్ కాలనీలో రహదారి మలుపు వద్ద సెట్‌బ్యాక్ లేకుండా వాణిజ్య షట్టర్ల నిర్మాణం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మలుపు ప్రాంతాలు సహజంగానే ప్రమాదావకాశాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలు. ఇలాంటి చోట గోడలు ఎత్తి షట్టర్లు ఏర్పాటు చేయడం వల్ల డ్రైవర్ల దృష్టి పూర్తిగా ఆవరిస్తుందని, ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ఢీ కొనే ప్రమాదం తీవ్రంగా పెరుగుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రహదారి వెడల్పు తగ్గిపోవడంతో భారీ వాహనాలు తిరగడానికే ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మార్గం జాతీయ రహదారికి అనుసంధానమై ఉండటంతో నిత్యం స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు భారీగా రాకపోకలు సాగిస్తున్నాయి. కేవలం కొద్ది దూరంలోనే బీసీ గురుకుల పాఠశాల ఉండటంతో విద్యార్థుల భద్రతపై మరింత సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాదచారులు, విద్యార్థులు అధికంగా సంచరించే ప్రాంతంలో ఇలాంటి నిర్మాణాలు కొనసాగడం ప్రజల్లో భయాందోళనలకు దారి తీస్తోంది. టౌన్ ప్లానింగ్ చట్టం ప్రకారం సెట్‌బ్యాక్, రోడ్ మార్జిన్, అనుమతులు వంటి నిబంధనలు తప్పనిసరి. అయితే స్థానికుల ఆరోపణల మేరకు అనుమతులు లేకుండానే రాత్రివేళల్లో పనులు వేగంగా సాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారుల




అనుమతి లేకుండా వాణిజ్య నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని వారు అంటున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలు కొనసాగితే జిహెచ్ఎంసికి చెల్లించాల్సిన ఫీజులు, పన్నులు, అభివృద్ధి ఛార్జీలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ప్రజల ప్రాణ భద్రతతో పాటు ప్రభుత్వ ఆదాయంపైనా ముప్పు నెలకొన్న నేపథ్యంలో సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే స్పందించి స్థలాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగాక చర్యలు తీసుకోవడం కాదు... ముందే కట్టడి చేయాలి, లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవని స్థానికులు అధికారులను హెచ్చరిస్తున్నారు. నాగారం డివిజన్ నేతాజీ నగర్ కాలనీలో మలుపు వద్ద సాగుతున్న ఈ అక్రమ నిర్మాణం ప్రస్తుతం ప్రజల్లో హాట్ టాపిక్‌గా మారింది.




# సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09, (తెలంగాణ దిశ)** :కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో విఐపి దర్శనాలతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కీసర గుట్టకు వెళ్ళిన కలెక్టర్ మన చౌదరి, మల్కాజ్గిరి డిసిపి శ్రీధర్ , ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఐపీఎస్, ఆర్డిఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్ లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు పెంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారికేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికీ తెలిపారు. జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దర్శనార్థం వచ్చే వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. కీసర గుట్ట



బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి , ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కీసర ఆలయంకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, చైర్మన్ కు తెలిపారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఏడుపాయల వనదుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న తిరుమల నగర్ కాలనీ వాసులు



**హెచ్ బి కాలనీ, ఫిబ్రవరి 09, (తెలంగాణ దిశ)** :ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవాని అమ్మవారిని ఉప్పల్ నియోజకవర్గం హెచ్ బి కాలని డివిజన్ తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మంజీరా నదీ పాయల మధ్య కొలువుదీరిన వనదేవతకు అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. లోకకల్యాణార్థం, కాలనీ వాసులందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు జరిపించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. అమ్మవారి కృపాకటాక్షాలతో మనశ్శాంతి లభించిందని, ఈ ఆధ్యాత్మిక యాత్ర ఎంతో సంతృప్తిని ఇచ్చిందని సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం కాలనీ వాసులంతా దుర్గమ్మ ఆశీస్సులతో తిరుగు ప్రయాణమయ్యారు.

# మైక్రోబయాలజీ గోల్డ్ మెడలిస్ట్‌కు ఆర్థిక సహాయం

## - ఎమ్మెల్యే వివేకానంద సహకారంతో ఉన్నత విద్యకు మార్గం
## - లయన్స్ క్లబ్ ద్వారా రూ.1.30 లక్షల ఆర్థిక సహాయం



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 09, (తెలంగాణ దిశ)** :మైక్రోబయాలజీ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించిన పేద విద్యార్థి శ్రీపతి ఉదయ్ కుమార్కు బీఆర్ఎస్ ఎల్పీ విప్, స్థానిక ఎమ్మెల్యే కె.పి. వివేకానంద సహకారంతో ఉన్నత విద్యకు అవసరమైన ఆర్థిక సాయం లభించింది. శ్రీపతి ఉదయ్ కుమార్‌కు ఆస్ట్రేలియాలోని ఆర్ఎంఐటీ యూనివర్సిటీలో మైక్రోబయాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుకునే అవకాశం లభించగా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే వివేకానందను ఆర్థిక సహాయం కోసం ఆశ్రయించారు. విద్యార్థి అభ్యర్థనకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యులకు తెలియజేశారు. ఎమ్మెల్యే సిఫారసుకు స్పందించిన లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం ఉదయం రూ. 1.30 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ తాను సిఫారసు చేసిన మూడు రోజులలోనే విద్యార్థికి అండగా నిలిచేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు ముందుకు రావడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే పేద విద్యార్థులకు సహకారం అందించాలని కోరారు. నియోజకవర్గంలో పేద విద్యార్థులు వైద్య, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసుకునేందుకు తన వంతుగా ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు ఆంజనేయులు, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ విజయ్ కుమార్ శెట్టి, సీనియర్ సభ్యులు చల్లా శ్రీనివాస రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, కోలా వెంకటేష్, ముదిరాజ్ శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు గౌడ్, బాలరాజు, ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

## - మూడు మున్సిపాలిటీలు ఇప్పటికే హస్తగతం
## - రాజకీయాలను ధన, వ్యాపారమయంగా మార్చిన మల్లారెడ్డి - మల్లారెడ్డి మాయ మాటలు నమ్మొద్దు పట్నం మహేందర్ రెడ్డి





**మేడ్చల్, ఫిబ్రవరి 09, (తెలంగాణ దిశ)** :మున్సిపాలిటీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ప్రజాస్వామ్య విలువలు, పారదర్శక పాలన కాంగ్రెస్ పాలనలోనే కనిపిస్తాయని ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ జిల్లాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజకీయాలను వ్యాపారంగా మార్చిన ఘనుడు మల్లారెడ్డి అని, ధన రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. పైకి మాటలు మరాఠీగా, లోపల మాత్రం వ్యాపార లాభాలపైనే దృష్టి ఉంటుందన్నారు. ఈలాంటి మాయ మాటలను ప్రజలు నమ్మొద్దని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించుకుంటే మున్సిపాలిటీల్లో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, పేదల సంక్షేమం వంటి అంశాలకు అత్యంత సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రజల డబ్బుతో ప్రజల కోసం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందన్నారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం పనిచేసే పార్టీ కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. మీ ఓటుతోనే మీ ఊరి భవిష్యత్తును మార్చుతుందన్నారు. అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అన్నారు. మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపించగల శక్తి కాంగ్రెస్‌కే ఉందని, ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# సంపాదకీయం

## స్వదేశీ ప్రచారం

శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు.. స్వయంసమృద్ధి చెందిన భారతదేశమే పునాది. రక్షణ, సాంకేతికత, ఇంధన, అంతరిక్షంతో పాటు తయారీ రంగాల్లో పురోగతి 2047 నాటికి మనల్ని అభివృద్ధి చెందిన భారత్‌గా నిలుపుతుంది'ఇటీవల 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలను నొక్కిచెబుతూ చేసిన వ్యాఖ్యలివి.యువత స్వదేశంలోనే జెట్ ఇంజిన్లు, సెమీకండక్టర్ చిప్స్, ఇతర సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని కోరుతున్నా. తద్వారా మనం స్వయంసమృద్ధి సాధించగలం" అని అన్నారు.స్వయంసమృద్ధి అంటే, కేవలం దేశానికే పరిమితం కాదని.. ఇతర దేశాలతో పరస్పర సహకారం కొనసాగిస్తూ శక్తిసామర్థ్యాలను, స్వయంప్రతిపత్తిని పెంపొందించుకోవడమని కూడా అన్నారు.కార్లు, ఫోన్ల తయారీ నుంచి వస్త్రాలు, ఆహార భద్రత వరకూ భారత్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన పురోగతి సాధించింది.అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాల విధింపు వంటి వాటి కారణంగా, 'స్వదేశీ' ప్రచారం ఊపందుకుంటోంది. వ్యవసాయం, మైనింగ్, ఇనుము, ఉక్కు, వాహనాల విడిభాగాలు, పారిశ్రామిక యంత్రాలు, ఫర్నిచర్, తోలు, పాదరక్షల తయారీ, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తులు, ఐటీ, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో భారత్ స్వావలంబన సాధించింది.కానీ, ఇంకా విదేశీ ముడి పదార్థాలు, టెక్నాలజీ, రీసర్చ్‌పై ఆధారపడిన అనేక రంగాలున్నాయి.మొబైల్ ఫోన్లు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవసరమైన సెమీకండక్టర్ చిప్స్ వంటి హైటెక్ ముడి వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది.అంతేకాకుండా.. చైనా సాంకేతిక నైపుణ్యం, సరసమైన ధరల కారణంగా భారత్ ఈ వస్తువుల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతోంది.ఈ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాల విషయంలో చొరవ తీసుకుంది.మేక్ ఇన్ ఇండియా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి స్కీముల ద్వారా భారత్‌లో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ముడి పదార్థాలు/వస్తువుల లభ్యత గురించి ఎలిస్టా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సీఎండీ సాకేత్ గౌరవ్ మాట్లాడుతూ, "మేం స్మార్ట్ టీవీలను తయారుచేస్తాం. వాటిలో వినియోగించే ముఖ్యమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. మా ఉత్పత్తులలో వినియోగించే అనేక భాగాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. అవి భారత్‌లో తయారవడం లేదు" అని చెప్పారు.ఎలిస్టా కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో రూ. 250 కోట్లతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది."అలాగే భారతీయ బ్రాండ్లు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఏంటంటే.. ఇక్కడ తయారైన వస్తువులు నాణ్యత పరంగా బాగున్నప్పటికీ, మన వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడతారు" అని సాకేత్ గౌరవ్ అన్నారు.అయితే, రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధిస్తుందని కూడా ఆయన అన్నారు."ఐదు నుంచి ఆరేళ్లలో ముఖ్యమైన విడిభాగాలను ఇక్కడే తయారు చేయగలమని ఆశిస్తున్నా. ప్రస్తుతం, అందుకు అవసరమైన టెక్నాలజీ, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు" అని సాకేత్ గౌరవ్ చెప్పారు."భారత్‌లో తయారైన ఉత్పత్తులు విదేశీ బ్రాండ్ల కంటే తక్కువ ధరకే లభిస్తాయి. కానీ, వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడుతున్నారు."ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి టర్బైన్ల వరకు, పర్మినెంట్ మాగ్నెట్స్, లైటింగ్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలు, అనేక ఇతర రోజువారీ నిత్యవసరాలతో సహా అనేక ఉత్పత్తుల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది.భారత్ తనకు అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో దాదాపు 99 శాతం దిగుమతి చేసుకుంటోంది. అందుకు చైనాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది.భారత్‌లో రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను రీసైక్లింగ్ చేసే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన అటెరో సీఈవో, కంపెనీ సహ వ్యవస్థాపకులు నితిన్ గుప్తా మాట్లాడుతూ, "భారత్ ప్రస్తుతం 99 శాతం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. కానీ, ఈ పరిశ్రమ పురోగతికి అనువైన వ్యవస్థను అభివృద్ధి చేసినట్లయితే.. భారత్ 70 శాతం అవసరాలను రీసైక్లింగ్ ద్వారా తీర్చుకోవచ్చు" అని అన్నారు.అటెరో కంపెనీ ఇటీవల తన సామర్థ్యాన్ని 300 టన్నుల నుంచి 30 వేల టన్నులకు పెంచుకుంది."చాలా ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ మెటీరియల్స్ చాలా కీలకం. భారత్ ఈ విషయంలో స్వయంసమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారత్‌లోనూ రేర్ ఎర్త్ మెటీరియల్స్ నిల్వలు ఉన్నాయి, కానీ ప్రస్తుతం వాటి మైనింగ్ జరగడం లేదు. ప్రపంచంలోని మొత్తం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో 99 శాతం చైనా నుంచే వస్తున్నాయి, ఈ విషయంలో భారత్ ఇప్పటివరకూ పెద్దగా చేసిందేమీ లేదు" అని నితిన్ గుప్తా అన్నారు."రీసైక్లింగ్ హబ్‌గా మారడం ద్వారా భారత్ తన అవసరాలను తీర్చుకునే దిశగా ముందుకెళ్లొచ్చు. మనం మార్కెట్‌లో పోటాపోటీ ధరకు రీసైకిల్ చేయగలం, కానీ అది భారీ స్థాయిలో జరగాల్సిన అవసరముంది."అయితే, కేవలం రీసైక్లింగ్ ద్వారానే భారత్ అవసరాలు తీరతాయా? అనేదే ఇక్కడి ప్రశ్న. విషయంలో నితిన్ గుప్తా ఆశావహంగానే ఉన్నారు..2025 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో, భారత్ 9.74 లక్షల టన్నుల డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్)ను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో డీఏపీ మొత్తం దిగుమతులు దాదాపు 45.7 లక్షల టన్నులు. యూరియా దాదాపు 56 లక్షల టన్నులు. ఎరువుల తయారీలో ఇది చాలా కీలకం.దేశీయంగా అవసరమైన ఖనిజాల కొరతతో పాటు అభివృద్ధి చెందిన మైనింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థ లేకపోవడం.లిథియం, కోబాల్ట్, మెగ్నీషియం, నికెల్ వంటి ముఖ్యమైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయితే, ఈ కీలకమైన ఖనిజ నిల్వలు భారత్‌లో పరిమితంగానే ఉన్నాయి. లేదంటే నిల్వలు ఉన్నప్పటికీ.. మైనింగ్ సాధ్యమయ్యే పరిస్థితి లేదు.ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు, జర్నలిస్ట్ నరేంద్ర తనేజా మాట్లాడుతూ, "భారతీయ పరిశ్రమలు ముడి చమురు, పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. పెట్రోకెమికల్స్‌పై ఆధారపడని రంగం దాదాపుగా అరుదు. కానీ, ఈ అవసరాలన్నింటికీ భారత్ దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్‌లో ముడిచమురు నిల్వలు లేవని కాదు, కానీ అవి ఉన్నచోట్ల వాటిని వెలికితీయడంలోనూ సవాళ్లున్నాయి" అని అన్నారు.భారత్ దేశీయ రక్షణ రంగ ఉత్పత్తిని ప్రోత్సహించినప్పటికీ, రక్షణ పరమైన అవసరాల కోసం ఇప్పటికీ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడి ఉంది.యుద్ధ విమానాల నుంచి జలాంతర్గాముల వరకు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను కూడా భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.2023 గణాంకాల ప్రకారం, భారత్ తన రక్షణ బడ్జెట్‌లో 36 శాతం దిగుమతులపైనే ఖర్చు చేసింది.జెట్ ఇంజిన్లు, రాడార్ల వంటి హైటెక్ పరికరాలను భారత్ ఇప్పటికీ దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది.ఇంకా, అధునాతన ఆయుధాల కోసం కూడా విదేశాలపై ఆధారపడుతోంది భారత్ దేశీయంగానూ రక్షణ రంగ ఉత్పత్తిని పెంచింది.

# అంతా నా ఇష్టమే' అన్నట్లుగా అనుమతులు లేకుండా షెడ్ నిర్మాణం

## - చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న టీపీఓ, జీహెచ్ఎంసి ప్లానింగ్ అధికారులు?









**ఘట్కేసర్, జనవరి 09, (తెలంగాణ దిశ)** :కరీంగూడ ప్రధాన రహదారి నుంచి కీసర వెళ్లే ప్రధాన రహదారి వెంట ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా షెడ్ నిర్మాణాలు జరుగుతున్నా జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే గుట్టుచప్పుడు కాకుండా అక్రమ షెడ్ నిర్మాణాలు దర్జాగా సాగుతుంటే, సర్కిల్ టౌన్ ప్లానింగ్ కార్యాలయం, టీపీఓ మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తుంది. అనుమతులు ఉన్నాయంటూ షెడ్ యజమాని ధీమాగా నిర్మాణాలు చేపడుతుండటం అధికారుల నిర్లక్ష్యానికా..? లేక లోపాయికారీ ఒప్పందాలకా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే కీలక విభాగమైన జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ శాఖ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతోందా? అనే సందేహాలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఖజానాకు గండిపడుతున్నా, ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టీపీఓ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. కరీంగూడ, కీసర ప్రధాన రహదారి వెంబడి జరుగుతున్న అక్రమ షెడ్ నిర్మాణాలపై ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు, కూల్చివేత చర్యలు చేపట్టకపోవడం అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణాలపై సంబంధిత జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి తప్పదని హెచ్చరిస్తున్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలి

### - మీడియా అకాడమీ చైర్మన్‌కు జడ్చర్ల జర్నలిస్ట్ సంఘం డిమాండ్లు

### - టోల్ ఫ్రీ ప్రయాణం, వంద శాతం సబ్సిడీతో పరికరాలు ఇవ్వాలి



**ఉప్పల్, ఫిబ్రవరి 09, (తెలంగాణ దిశ)** :జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జడ్చర్ల జర్నలిస్ట్ సంఘం నాయకులు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా బస్ పాస్ సౌకర్యం కల్పించాలని, ప్రతి ప్రింట్ జర్నలిస్టుకు ల్యాప్టాప్, కెమెరా, వీడియో జర్నలిస్టులకు ల్యాప్ టాప్‌తో పాటు వీడియో కెమెరాలను 100 శాతం సబ్సిడీపై అందించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అక్రిడిటేషన్ కార్డును ఆధారంగా చేసుకొని అన్ని టోల్ గేట్లలో ఫ్రీ టోల్ సౌకర్యం కల్పించడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులు సమాజానికి సమాచార వారధిగా పనిచేస్తున్న నేపథ్యంలో వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల నుంచి వచ్చే జర్నలిస్టులకు ప్రత్యేకంగా రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించి, పూర్తి స్థాయి సర్టిఫికెట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధికి మీడియా అకాడమీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జడ్చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎండి. సుల్తాన్, ఉపాధ్యక్షుడు శేఖర్ తెలుగు, సంయుక్త కార్యదర్శి మల్లేష్, సీనియర్ పాత్రికేయులు, ఈసీ మెంబర్ తాంబూలం శ్రీనివాస్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మైనారిటీ సంక్షేమ గురుకుల సీఓఈ ప్రవేశ పరీక్ష వాయిదా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09, (తెలంగాణ దిశ)** :తెలంగాణ మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రవేశ పరీక్షను పరిపాలనా కారణాల వల్ల వాయిదా వేసినట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి జి. కాంతమ్మ తెలిపారు.

ముందుగా ఈ నెల 12న నిర్వహించాల్సిన ఈ ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 14 శనివారంకు మార్చినట్లు ఆమె వెల్లడించారు. ఈ పరీక్ష ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్లను సంబంధిత మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నుండి లేదా సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని సూచించారు. అభ్యర్థులు పరీక్ష తేదీ మార్పును గమనించి, నిర్ణీత తేదీ, సమయానికి పరీక్షకు హాజరుకావాలని ఆమె కోరారు.

# చీఫ్ మినిస్టర్ కప్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

### - హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఘనంగా నిర్వహణ

### - 500 మందికి పైగా క్రీడాకారుల పాల్గొనడం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09, (తెలంగాణ దిశ)** : తెలంగాణ ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ . తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో చీఫ్ మినిస్టర్ కప్--2025 జిల్లా స్థాయి క్రీడోత్సవాలు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాహకీంపేట్ లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ సోమవారం ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్డీ మమత, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి ఐ. విజయ కుమారి ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. పీఈటీలు, క్రీడా సిబ్బంది సమక్షంలో పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో భాగంగా కబడ్డీ, వాలీబాల్, కోకో, ఫుట్‌బాల్, సైక్లింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా, సుమారు 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పంపిస్తామని యువజన, క్రీడల జిల్లా అధికారి తెలిపారు. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి కింద రూ.లక్ష, ద్వితీయ బహుమతి కింద రూ.75 వేలు, తృతీయ బహుమతి కింద రూ.50 వేలు అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలు యువతలో క్రీడలపై ఆసక్తి పెంపొందించడంతో పాటు, ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

### - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్





**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 09 (తెలంగాణ దిశ)** :మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల చివరి రోజు అయిన సోమవారం మున్సిపల్ పరిధిలోని 4వ, 5వ, 13వ, 15వ, 16వ, 18వ, 19వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు మహమ్మద్ షరీఫ్, సారిక శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ సత్తయ్య, నక్క సంతోష్ రాములు, సత్యలక్ష్మి యాదగిరి, సయ్యద్ మతిన్, మున్వర్ ఆలీలకు మద్దతుగా గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డితో కలిసి ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గజ్వేల్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రజలు ఓటు వేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డితో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ శ్రీ అయ్యప్ప స్వామి సేవార్థి ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఎన్నిక






**హైదరాబాద్, ఫిబ్రవరి 09, (తెలంగాణ దిశ)** :నలభై సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి భక్తులకు అంకితభావంతో సేవలందిస్తున్న తెలంగాణ శ్రీ అయ్యప్ప స్వామి సేవార్థి ఐక్యవేదికకు 2026--2028 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం ధర్మరక్షణ, లోకకళ్యాణం లక్ష్యంగా వాకిటి భాస్కర్ రావు గురుస్వామి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, వరిష్ఠ గురుస్వాముల ఆధ్వర్యంలో ఈ సంస్థ ఏర్పాటైంది. అయ్యప్ప భక్తులకు ఎదురయ్యే సాధక, బాధకాలు, రవాణా, భోజన వసతి, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు స్వామివారికి జరిపించే పూజలు, సేవలు, కైంకర్యాలు, వార్షికోత్సవాలు నిర్వహించడం సంస్థ ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. అలాగే అనాథ పిల్లలు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, వైద్య సహాయం, గోసేవ వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు నాయకులు తెలిపారు.2026--2028 కాలానికి నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా వాకిటి భాస్కర్ రావు, ప్రధాన కార్యదర్శిగా దుర్గమహంతి మోహన రావు, కోశాధికారిగా వివిఆర్ఎ. ప్రసాద్లను ఎన్నుకున్నారు. సంస్థ అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు. భవిష్యత్తులో అయ్యప్ప భక్తుల సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

# ఎక్సైజ్ సీఐ, ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు..

జమ్మికుంట,: స్థానిక జమ్మికుంట గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జమ్మికుంట ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సీఐ, మాధవి లత, ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. దీనిని ఉద్దేశించి ఎక్సైజ్ సీఐ,మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత బానిస అవుతే వారి జీవితం సర్వనాశనం అవుతుందని అంతేకాకుండా కన్న తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నిర్వీర్యం చేసిన వాళ్ళు అవుతారని డ్రగ్స్ అమ్మేటువంటి లేదా డ్రగ్స్ తీసుకునేటువంటి విద్యార్థిని విద్యార్థులు కావచ్చు ఇంకా ఎవరైనా మీకు తెలిసిన వారు ఉంటే ఎక్సైజ్ సీఐ, కు సమాచారం ఇవ్వవలసిందిగా పిల్లల్ని ఉద్దేశించి సీఐ మాధవి లత, తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వి.పెద్దన్న, మరియు ఎండి ఫయాజుద్దీన్, శైలజ, ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపకులు రాగశ్రీ, అంజిబాబు, రమేష్,సాగర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...

# నల్ల జీలకర్రలో అనేక లాభాలు..!




జీలకర్రను మనం ఎప్పటి నుంచో వంట ఇంటి పోపు దినుసుగా ఉపయోగిస్తున్నాం. జీలకర్రను నిత్యం అనేక వంటల్లో వేస్తుంటారు. జీలకర్రను కూరల్లో వేస్తే కూరలు చక్కని వాసన వస్తాయి. రుచిగా కూడా ఉంటాయి. అయితే జీలకర్రలో మరో రకం జీలకర్ర కూడా ఉంటుంది. అదే నల్ల జీలకర్ర. దీన్ని చాలా మంది చూసి ఉండరు. కానీ నల్ల జీలకర్రను కూడా మనం ఉపయోగించవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. నల్ల జీలకర్రను ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుండాలి. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. నల్ల జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ వీటిల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తుంది. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

కీళ్ల నొప్పులు, వాపులకు..: నల్ల జీలకర్రలో అధికంగా ఉండే థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఈ జీలకర్రను వేసి మరిగించిన నీళ్లను రోజూ సేవిస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. నల్ల జీలకర్రలో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. అంటే దీన్ని తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. నల్ల జీలకర్రలో ఉండే సమ్మేళనాలు ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలను తగ్గించేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. నల్ల జీలకర్రను తీసుకుంటే అలర్జీలను సైతం తగ్గించుకోవచ్చు. శ్వాస నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయి గాలి సరిగ్గా లభిస్తుంది. ఊపిరి సరిగ్గా పీల్చుకుంటారు.

షుగర్ ఉన్నవారికి..: అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్ర ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి నల్ల జీలకర్ర ఎంతగానో మేలు చేస్తుంది. డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవచ్చు. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్రను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతోపాటు ట్రై గ్లిజరైడ్స్ కూడా తగ్గుతాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.

క్యాన్సర్ కణాలకు ఔషధం..: నల్ల జీలకర్రలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకుంటాయి. దీంతో క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. సైంటిస్టులు జంతువులపై చేసిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. నల్ల జీలకర్ర నుంచి తీసిన నూనె కూడా మనకు లభిస్తుంది. దీన్ని వాడడం వల్ల అనేక చర్మ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా మొటిమలు, గజ్జి, తామర, దురద, సోరియాసిస్ వంటి సమస్యలకు ఈ నూనె చక్కగా పనిచేస్తుంది. గాయాలు,పుండ్లను త్వరగా మానేలా కూడా చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నల్ల జీలకర్ర నూనె జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తుంది. శిరోజాలకు దీన్ని రాస్తుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా మారుతాయి. ఇలా నల్ల జీలకర్రను వాడితే అనేక లాభాలను పొందవచ్చు.

# గుండెపోటుకు చెక్ పెట్టే ఈ ఫుడ్ ఐటమ్స్ గురించి మీకు తెలుసా..?



ఈ మధ్యకాలంలో గుండెపోటు మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్నాపెద్దా, ఆడామగ తేడా లేకుండా గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయి. నిత్యం కసరత్తులు చేసి ఫిట్‌గా ఉండే క్రీడాకారులు, ఎలాంటి గుండె జబ్బుల ఆనవాళ్లు లేని ఆరోగ్యవంతులు కూడా అకస్మాత్తుగా వచ్చే హార్ట్ ఎటాక్‌లతో, కార్డియక్ అరెస్ట్‌లతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ఆకస్మిక గుండె రుగ్మతలకు చెక్‌పెట్టేందుకు కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం..

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉత్తమమైన ఆహార పదార్థాలు చేపలు, గుడ్లు. ఈ రెండింటిలోనూ ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. మీరు శాఖాహారులైతే చేపలు, గుడ్లకు బదులుగా డ్రై ఫ్రూట్స్ తినవచ్చు. డ్రై ఫ్రూట్స్‌లో కూడా ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులను నివారిస్తాయి. పప్పుధాన్యాలు, బీన్స్‌ను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి శరీరానికి పుష్కలంగా ప్రోటీన్‌ను అందించడంతోపాటు గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడుతాయి. అదేవిధంగా సిట్రస్ జాతి పండ్లలో కూడా గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అనేక పోషకాలు ఉంటాయి. సిట్రస్ పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దాంతో ఆకస్మిక గుండెపోట్లు, కార్డియాక్ అరెస్ట్‌ల వంటివి జరగకుండా ఉంటాయి.

# కాలానికి తగ్గట్టే..

ఆహార అలవాట్లను కూడా.. కాలానికి తగ్గట్టుగా మార్చుకోవాలి. ఇష్టమైన వంటకమైనా.. సీజన్‌కు సెట్‌కాకుంటే పక్కన పెట్టేయాలి. లేదంటే, ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ముఖ్యంగా, వేసవిలో కొన్ని కూరగాయలతో అనారోగ్యం పొంచి ఉంటుంది. కాబట్టి, ఎండకాలంలో ఏయే కూరగాయలు, వంటకాలు తినకూడదో తెలుసుకుంటే మంచిది. వంకాయ.. కూరగాయల్లో రారాజుగా పేరు. కానీ, వేసవిలో మాత్రం ఆరోగ్యానికి శత్రువు. వంకాయను వేడి కూరగాయగా చెబుతారు నిపుణులు. వేసవిలో దీన్ని తినడం వల్ల జీర్ణవ్యవస్థను బలహీనపరుస్తుంది. మలబద్ధకం, గ్యాస్ వంటి పొట్ట సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొందరిలో అలెర్జీలు కూడా రావొచ్చు. ఆరోగ్యానికి ఎంతో మేలుచేసే కాలీఫ్లవర్.. ఎండల్లో శరీరానికి హాని కలిగిస్తుంది. ఇందులో అధిక మొత్తంలో సల్ఫర్ ఉంటుంది. ఇది శరీరంలో వేడిని పెంచుతుంది. ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలకూ దారితీస్తుంది.

మూత్రపిండాల సమస్యలు, రక్తంలో చక్కెర స్థాయులు తక్కువగా ఉన్నవారు వేసవిలో చేమదుంపలను తినకూడదని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఆగ్జాలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది మూత్రపిండాల పని తీరుపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా, వేసవిలో డీహైడ్రేషన్ వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. అలాంటి కాలంలో చేమదుంపలు తింటే.. కిడ్నీలకు మరింత హాని కలుగుతుంది. మాంసం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో, జీర్ణవ్యవస్థపై అధిక ఒత్తిడి పడుతుంది. ఇక



శరీరం వేడిగా ఉండే వేసవిలో మటన్ వంటకాలు తింటే.. శరీర ఉష్ణోగ్రత మరింతగా పెరుగుతుంది. కాబట్టి, వేసవిలో మాంసాహారాన్ని తగ్గించుకోవడం మంచిది. ఇక వేడివేడి కాఫీలు, టీలను కూడా తగ్గించాలి. ఇవి శరీర ఉష్ణోగ్రతను అమాంతం పెంచేసి, మరింత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. వీటికి బదులుగా మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లను ఎంచుకుంటే బెటర్! వేసవి అంటేనే.. పచ్చళ్ల సీజన్. ముఖ్యంగా ప్రతి ఇంట్లోనూ మామిడికాయలతో పచ్చళ్లు పెట్టుకుంటారు. కానీ, ఈ కాలంలో వీటికి దూరంగా ఉండటమే మంచిది. పచ్చళ్లలో ఉప్పు, నూనె అధికంగా వాడతారు. ఉప్పు అధికంగా తీసుకుంటే.. శరీరం త్వరగా నీటిని కోల్పోతుంది. ఇది డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. ఇక, అధిక నూనె కూడా వేసవిలో అనారోగ్యానికి కారణమవుతుంది.

# నిమ్మ ఆకులను ఎలా ఉపయోగించాలంటే..

## ఈ ఇంటి చిట్కాలను పాటించండి..!



నిమ్మకాయల వల్ల మనకు ఎన్ని అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. నిమ్మరసాన్ని చాలా మంది వేసవిలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీని వల్ల శరీరంలో ఉన్న వేడి తగ్గుతుంది. నిమ్మకాయల్లోని రసంలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా వ్యాధులను దరి చేరకుండా చేస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. అయితే నిమ్మకాయలు మాత్రమే కాదు, నిమ్మ చెట్టు ఆకులు కూడా మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. నిమ్మ ఆకులను ఉపయోగించి అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. నిమ్మ ఆకుల్లో సిట్రిక్ యాసిడ్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవన్నీ మనకు రోగాలు రాకుండా చూస్తాయి. ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి.

నిద్రలేమి సమస్యకు..: నిమ్మ ఆకులను కొన్ని తీసుకుని కొద్దిగా నలిపి నీటిలో వేసి మరిగించాలి. 10 నిమిషాలు మరిగాక స్టవ్‌ను ఆఫ్ చేసి నీళ్లను వడకట్టి ఆ నీళ్లు గోరు వెచ్చగా ఉండగానే కొద్దిగా తేనె కలిపి తాగేయాలి. ఈ నీళ్లను తాగుతుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుం ది. రాత్రి పూట ఈ నీళ్లను తాగితే మనస్సుకు విశ్రాంతి కలిగి నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఈ నీళ్లను సేవించడం వల్ల జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. అసిడిటీ సమస్య ఉన్నవారు మాత్రం ఈ నీళ్లను సేవించకూడదు. నిమ్మ ఆకులను కొన్ని తీసుకుని కొద్దిగా నలిపి చర్మం కనిపించే ప్రాంతాల్లో రాయాలి. దీంతో దోమలు దూరంగా పోతాయి. అలాగే ఇంట్లో కిటికీలు, తలుపులు, ఇతర ప్రదేశాల్లో నిమ్మ ఆకులను నలిపి చిన్నపాటి గిన్నెలో ఉంచితే ఈగలు, పురుగులు, బొద్దింకలు రాకుండా అడ్డుకోవచ్చు.

చర్మ సంరక్షణకు..: నిమ్మ ఆకులను కొద్దిగా నలిపి నీటిలో వేసి బాగా కలిపి ఆ నీళ్లతో స్నానం చేయాలి. దీంతో చెమట వాసన రాదు. దుర్వాసన రాకుండా అడ్డుకోవచ్చు. శరీరం చక్కని వాసనను అందిస్తుంది. ఇది మనస్సును కూడా రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. అలాగే చర్మం సంరక్షించబడుతుంది. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోయి కాంతివంతంగా మారుతుంది. చర్మం మెరుస్తుంది. సహజసిద్ధమైన నిగారింపును పొందుతుంది. కొన్ని నిమ్మ ఆకులను నీటిలో వేసిమరిగించాలి. ఆ నీళ్లను సగం బకెట్ గోరు వెచ్చని నీటిలో పోసి కలపాలి. అనంతరం ఆ బకెట్‌లో పాదాలను మునిగేలా 15 నిమిషాల పాటుఉంచాలి. ఇలాచేస్తుంటే పాదాలకండరాలకు ప్రశాంత త లభిస్తుంది. పాదాలు, కాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

సహజసిద్ధమైన రిఫ్రెషనర్‌గా..: నిమ్మ ఆకులను సహజసిద్ధమైన రిఫ్రెషనర్‌గా కూడా ఉపయోగించవచ్చు. నిమ్మ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను సేకరించి ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఉపయోగించాలి. ఇంట్లో దుర్వాసన వస్తున్న చోట్లలో ఈ నీళ్లను స్ప్రే చేయాలి. దీంతో వాసన పోతుంది. రూమ్ అంతా పరిమళంతో నిండిపోతుంది. నిమ్మ ఆకులను బాగా నూరి మెత్తని పేస్టులా చేసి అందులో కాస్త తేనె, పెరుగు వేసి కలిపి ఫేస్ ప్యాక్‌లా తయారు చేయాలి. దీన్ని ముఖానికి రాసి ఆరిన తరువాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖంపై ఉండే మృత చర్మ కణాలు తొలగిపోతాయి. ముఖంపైఉండే ముడతలు, మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. ముఖం మృదువుగా మారుతుంది. చర్మంపై అలర్జీలు వచ్చే వారు ముందుగా ప్యాచ్ టెస్ట్ చేసి ఈ చిట్కాను ఉపయోగించాలి. నిమ్మ ఆకులను పేస్ట్‌లా చేసి అందులో పెరుగు కలిపి జుట్టుకు పట్టించి కాసేపు అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా చేస్తుంటే చుండ్రు పోతుంది. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. ఇలా నిమ్మ ఆకులతో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# కాఫీకీ ఓ టైముంది



కాఫీ తాగడం.. ఆరోగ్యానికి మంచిదే! కానీ, ఎప్పుడు తాగుతున్నాం? ఎంత తాగుతున్నాం? అనేది కూడా ముఖ్యమని అంటున్నారు అమెరికా పరిశోధకులు. గుండె, శరీరం మీద కెఫీన్, కాఫీ తాగే సమయం చూపించే ప్రభావాలపై ఓ పరిశోధన జరిగింది. అమెరికా నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సంస్థ.. దాదాపు పదేండ్లపాటు ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందులో పాల్గొన్నవారు రోజుకు కనీసం ఒక్కసారైనా తీసుకునే ఆహారం, పానీయాలను క్షుణ్నంగా పరిశీలించింది. సర్వే సమయంలో సంభవించిన మరణాలను, వాటి కారణాలను నమోదు చేసింది. ఆయా డేటాలను విశ్లేషించి.. ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. వీరిలో 52 శాతం మందికి కాఫీ తాగే అలవాటు ఉంది. అందులోనూ 36 శాతం మంది ఉదయం మాత్రమే కాఫీ తాగుతుండగా.. మిగిలిన 16 శాతం మంది రోజులో అనేకసార్లు కాఫీ తాగుతారని చెప్పారు. అయితే, కాఫీ తాగనివారితో పోలిస్తే.. ఉదయంపూట కాఫీ తాగేవారికి ఏ కారణంతోనైనా మరణం సంభవించే ముప్పు 16 శాతం, గుండెజబ్బుతో మరణించే ముప్పు 31 శాతం తక్కువగా ఉంటున్నట్టు తేలింది. అయితే, రోజంతా రెండుమూడు సార్లు కాఫీ తాగేవారిలో ఇలాంటి ప్రయోజనాలేవీ కనిపించలేదని పరిశోధకులు వెల్లడించారు. మధ్యాహ్నం, సాయంత్రం కాఫీ తాగేవారిలో జీవ గడియారం క్రమం తప్పుతుందనీ, మెలటోనిన్ వంటి హార్మోన్ల మోతాదులు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఫలితంగా ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి.. రక్తపోటు, గుండెజబ్బు ముప్పు పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.



# బత్తాయి పండ్లను లైట్ తీసుకోకండి..

## ఇవి మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు..

బత్తాయి పండ్లు.. చూసేందుకు అచ్చం నారింజ పండ్లలాగే ఉంటాయి. కానీ నారింజ పండ్లంత తియ్యగా ఉండవు. మరీ పుల్లగా కూడా ఉండవు. కానీ ఇవి రుచిగా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. చాలా మంది రహదారుల పక్కన ఉండే జ్యూస్ సెంటర్లలో బత్తాయి రసం తాగేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఈ పండ్లు కాస్త తీపి, పులుపు రుచి కలిగి ఉంటాయి. చూసేందుకు పెద్ద నిమ్మ పండు సైజులో ఉంటాయి. బత్తాయి పండ్లనే స్వీట్ లైమ్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్ల గుజ్జు లేత పసుపు రంగులో ఉంటుంది. బత్తాయి పండ్లను చాలా మంది నేరుగా తింటారు. కానీ ఈ పండ్లను జ్యూస్‌గా తాగితేనే చాలా బాగుంటుంది. బత్తాయి పండ్ల రసాన్ని చాలా మంది ఇష్టంగా తాగుతారు. బత్తాయి పండ్లను తింటున్నా లేదా జ్యూస్‌ను తాగుతున్నా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.


నోటి దుర్వాసనకు చెక్..: బత్తాయి పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. జలుబు, జ్వరం వచ్చినప్పుడు రోజుకు 2 సార్లు ఈ పండ్ల జ్యూస్‌ను తాగాలి. దీంతో త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. చురుగ్గా మారుతారు. బత్తాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది దంతాలు, చిగుళ్లను దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. బత్తాయి పండ్లను తింటే నోట్లో లాలా జలం అధికంగా స్రవించబడుతుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సులభంగా, త్వరగా జీర్ణం చేస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

మలబద్ధకం ఉండదు..: బత్తాయి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే మలబద్ధకం తగ్గుతుంది. రోజూ ఉదయం సుఖ విరేచనం అవుతుంది. బత్తాయి పండ్లలో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు, ఆమ్లాలు విడుదల అయ్యేందుకు సహాయం చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది.

ఏదైనా వ్యాధి వచ్చిన వారు బత్తాయి పండ్ల రసాన్ని సేవిస్తుంటే త్వరగాశక్తి లభించి రోగం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉదయం జాగింగ్ లేదా వాకింగ్, యోగా, వ్యాయామం చేసిన అనంతరం ఒక గ్లాస్ బత్తాయి పండ్ల రసం సేవిస్తే శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. ఎంత పనిచేసినా నీరసం, అలసట రావు. బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా టీ, కాఫీ వంటివి తాగకుండా బత్తాయి పండ్ల రసం తాగితే ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

విరేచనాల నుంచి ఉపశమనం..: బత్తాయి పండ్లలో ఉండే ఆమ్లాలు జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతాయి. దీంతో జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అజీర్తితో బాధపడేవారికి బత్తాయి రసం ఔషధంగా పనిచేస్తుంది. బత్తాయి పండ్లలో ఉండే పొటాషియంవిరేచనాలను తగ్గిస్తుంది. బాధితులు త్వరగా కోలుకునేలా చేస్తుంది. కామెర్లు వచ్చిన వారు ఈ పండ్ల రసం తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. వాంతులు, తలతిరగడం వంటి సమస్యలు ఉన్నవారు బత్తాయి పండ్ల రసం తాగితే మంచిది. గొంతు సంబంధ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారు బత్తాయి రసం తాగితే త్వరగా ఉపశమనం లభిస్తుంది. రోజూ ఈ జ్యూస్‌ను సేవించడం వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బ్లడ్ క్లాట్స్ కరిగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా బత్తాయి పండ్లు మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు. కనుక ఇవి కనబడితే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.

# భారతీయుల పిల్లలకు ‘గ్రీన్ కార్డ్’ బెంగ




న్యూఢిల్లీ: అమెరికా ఇమిగ్రేషన్ నిబంధనలు మారనున్న కారణంగా వేలాది మంది పిల్లలు ముఖ్యంగా భారత్‌కు చెందినవారు స్వదేశాలకు తరలిపోవలసిన ముప్పును ఎదుర్కోనున్నారు. తమ తల్లిదండ్రుల గ్రీన్‌కార్డు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, హెచ్-1బీ వీసాదారుల పిల్లలు 21 సంవత్సరాలు దాటిన మరుక్షణం తమకు ఇప్పటివరకు ఉన్న రక్షిత ఇమిగ్రేషన్ హోదాను కోల్పోయే అవకాశం ఉంది. చైల్డ్ స్టేటస్ ప్రొటెక్షన్ యాక్ట్(సీఎస్‌పీఏ) కింద పిల్లల వయసును లెక్కించే నిబంధనలకు సంబంధించి అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తాజా సమాచారాన్ని ప్రకటించింది. గ్రీన్ కార్డులు కోరుతూ 2025 ఆగస్టు 15 తర్వాత దాఖలయ్యే దరఖాస్తులకు కొత్త నిబంధనలు వర్తించనున్నాయి. తాజా నిబంధనల కింద సీఎస్‌పీఏ వయసును లెక్కించడానికి వీసా లభ్యత నిర్ధారణ కోసం వీసా బులెటిన్‌లోని ఫైనల్ యాక్షన్ డేట్స్ చార్ట్‌ని యూఎస్‌సీఐఎస్, విదేశాంగ శాఖ కలిసి ఉపయోగించుకుంటాయి. గ్రీన్‌కార్డుల కోసం, ఇమిగ్రంట్ వీసా కోసం సమర్పించే దరఖాస్తుల కోసం సీఎస్‌పీఏ వయసును లెక్కించడం జరుగుతుంది. 2023 ఫిబ్రవరిలో బైడెన్ ప్రభుత్వం తీసుకువచ్చిన విధానం ప్రకారం గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అర్హతను సాధించుకున్న హెచ్-1బీ వీసాదారులకు చెందిన కొందరు పిల్లలకు తమ తల్లిదండ్రులతో పాటే అమెరికాలో నివసించే రక్షణ లభిస్తుంది. గ్రీన్‌కార్డు కోసం తల్లిదండ్రులు వెయిటింగ్‌లో ఉండగా పిల్లల వయసు 21 దాటినప్పటికీ తాము అమెరికాలో నివసించే అర్హతను వారు కోల్పోరు. 21 ఏళ్ల లోపు అవివాహిత వ్యక్తులను పిల్లలుగా ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్ నిర్వచిస్తుంది. కొత్త నిబంధనల ప్రకారం గ్రీన్‌కార్డు కోసం వేచిచూస్తున్న హెచ్-1బీ వీసాదారుల పిల్లలు 21 ఏళ్లు దాటిన తర్వాత అమెరికాలో నివసించే చట్టపర అర్హత కోల్పోతారు.

# అడవి తల్లిబాటకు శ్రీకారం

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఆ ప్రాంతాల ప్రజలు ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న సౌకర్యం చివరికి వారి గడపకు రానున్న సమయం ఆసన్నమైంది. కొండలు, అడవులు, లోయల మధ్య ఉంటూ రోడ్డు అనే మాట విని కూడా చూడని గిరిజన ఆవాసాల జీవితం ఇక పూర్తిగా మారబోతోం ది. ఒక నిర్ణయం, ఒక ప్రణాళిక ఇప్పుడు వారిని అభివృద్ధి దిశగా నడిపించబోతుంది. ఈ ప్రణాళిక పూర్తయ్యే సరికి, ఆ ప్రాంతాల ప్రజలకు ఇది నిజమైన పండుగవలె మారనుంది. ఇంతకు ఆ నిర్ణయం తీసుకున్నది ఎవరో కాదు ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్. ‘అడవి తల్లి బాట’ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ‘అడవి తల్లి బాట’ పేరుతో చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం అందనుంది. రూ.1005 కోట్లతో భారీ ప్రాజెక్ట్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పీఎం జన్ మన్ పథకం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి మొత్తం రూ. 1005 కోట్లతో చేపట్టబడింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు రహదారి సౌకర్యం లేని ఆవాసాలను కూడా అనుసంధానించేలా రెండు దశల్లో ఈ పనులు కొనసాగుతున్నా యి. సవాళ్లు, అవరోధాలు.. కానీ అడుగులు ఆగవు అధికారులు సమావేశంలో పనుల ప్రస్తుత స్థితి వివరించారు. కొండలపై ఉన్న ఆవాసాలను కలిపే రోడ్లు వేసేందుకు బండరాళ్లను బద్ధలుకొడుతూ ముందుకు సాగడం వల్ల ఎక్కువ సమయం పట్టుతోందని, అలాగే నిటారుగా ఉన్న ప్రాంతాలు కావడంతో సాంకేతిక జాగ్రత్తలు తప్పనిసరని చెప్పారు. ప్రస్తుతం వర్షాల ప్రభావంతో పనుల వేగం కొంత తగ్గిందని, అయితే ప్రయత్నాలు ఆగలేదని తెలిపారు. అటవీ అనుమతుల సమస్య ? పరిష్కారం దిశగా మొత్తం 128 రహదారి మార్గాలు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉండటంతో అటవీ అనుమతులు అవసరమయ్యాయి. వీటిలో 98 మార్గాలకు ఇప్పటికే అనుమతులు వచ్చాయని అధికారులు చెప్పారు. ఇప్పటివరకు 186 పనులు ప్రారంభమయ్యాయని, మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నాయని, టెక్నికల్ ఎవాల్యుయేషన్ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. పవన్ కళ్యాణ్ ఏమన్నారంటే? ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం డోలీరహిత గిరిజన ఆవాసాల లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పీఎం జన్ మన్ పథకం ద్వారా రూ.555.6 కోట్లు కేటాయించి సహకరించారని పవన్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను కూడా వినియోగిస్తున్నాం. ఇన్ని వనరులు ఉన్నందున ‘అడవి తల్లి బాట’ పనుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిరంతర పర్యవేక్షణతోనే పనులు వేగంగా పూర్తవుతాయి. సవాళ్లు ఎదురైనా ప్రణాళికాబద్ధంగా అధిగమించాలి. అవసరమైతే అటవీ శాఖతో సమీక్ష జరిపి అనుమతులను త్వరగా పొందాలని పేర్కొన్నారు. స్థానికుల భాగస్వామ్యం అవసరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఈ పనుల ప్రాధాన్యతను స్థానికులకు తెలియజేయాలని, తద్వారా వారు కూడా సహకరించేందుకు ముందుకు వస్తారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రహదారి సౌకర్యం లేని ఆవాసాలు తొలిసారి రోడ్డు పొందుతున్నాయి. ఇది కేవలం రోడ్డు కాదు, అభివృద్ధి దారిలో ఒక మలుపు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పి వారిలో నమ్మకం, ఉత్సాహం కలిగించాలని ఆయన స్పష్టం చేశారు. డోలీరహిత ఆవాసాల లక్ష్యం ఈ ప్రాజెక్ట్ పూర్తయితే గిరిజన ప్రాంతాల వాణిజ్యం, విద్య, వైద్య సౌకర్యాలు అన్ని వేగవంతం అవుతాయి. అటు పర్యాటకానికి, ఇటు స్థానికుల ఆర్థికాభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. రవాణా సౌకర్యం లేని కారణంగా ఇప్పటి వరకు పక్కనున్న పట్టణాలకు చేరుకోవడమే కష్టంగా ఉన్న పరిస్థితి, రోడ్లు అందుబాటులోకి రాగానే పూర్తిగామారిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ, సాంకేతిక నాణ్యత, ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయాలని సంకల్పించింది. ‘అడవి తల్లి బాట’ విజయవంతమైతే, ఇది ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా మారే అవకాశం ఉంది. అభివృద్ధి కాంతి ఇప్పటివరకు తాకని గిరిజన ప్రాంతాల గడప దాటబోతోంది.

## జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం కీలక మలుపు

న్యూఢిల్లీ, : ఇంట్లో నోట్ల కట్టలు లభించిన ఘటనలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఆయన అభిశంసన కోసం లోక్‌సభ సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్పీకర్ ఓం బిర్లా స్వీకరించారు. ఈ ఉదంతంపై విచారణ కోసం ముగ్గురు సభ్యులతో కూడిన ఓ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్యానెల్‌లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు జస్టిస్ ఎమ్ఎమ్ శ్రీవాత్సవ, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్యులు సభ్యులుగా ఉన్నారు. అభిశంసన తీర్మానంపై ప్రతిపక్ష, పాలక పక్షానికి చెందిన 146 మంది సంతకం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ అభిశంసన పక్రియ ప్రారంభం కావాల్సిందేనని అన్నారు. అవినీతికి పార్లమెంటు పూర్తిగా వ్యతిరేకమని చెప్పారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని అన్నారు. ఇక స్పీకర్ ఏర్పాటు- చేసిన కమిటీ ఈ ఉదంతానికి సంబంధించిన సాక్షులు ప్రశ్నించి, ఆధారాలను పరిశీలిస్తుంది. విచారణ అనంతరం, తుది నివేదికను స్పీకర్‌కు సమర్పిస్తుంది. అనంతరం నివేదికను సభ ముందు ఉంచుతారు. ఈ ఉదంతంలో న్యాయమూర్తి దోషిగా తేలిన పక్షంలో ఆయన అభిశంసన తీర్మానంపై ఓటింగ్ జరుగుతుంది. రాజ్యసభలో కూడా ఇదే పక్రియను అమలు చేస్తారు. ఉభయ సభలు ఆమోదించిన తీర్మానానికి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిస్తారు.

# గిరిజనులకు అంబేద్కర్ వర్శిటీ ఉచిత విద్య...




హైదరాబాద్, : కొంత మంది ఉన్నత చదువులు చదివి.. పెద్ద ఉద్యోగం చేయాలనే ఆశతో ఉంటారు. కానీ దానికి తగ్గట్లు ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మధ్యలో తమ చదువులు ఆపేసి ఏదో ఒక ఉద్యోగం చేస్తుంటారు. ఇక మహిళలకు అయితే పెళ్లి చేసి.. తమ బాధ్యతలను తీర్చుకుంటారు చాలా మంది తల్లిదండ్రులు. కానీ.. వారికి ఇంకా చదవాలనే కోరిక మాత్రం అలానే ఉండిపోతుంది. అలాంటి వారి కోసం ఓపెన్ విద్య అనేది ఒక వరంలాంటిది. ముఖ్యంగా తెలంగాణలో డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇలాంటి వారి ఎందరో కలలను నెరవేర్చింది. మధ్యలో చదువు ఆపేసిన వారికి.. ఉద్యోగం చేస్తూ చదువుకోవాలనుకునే వారికి వారి కోరికలను తీర్చింది.కొంతమంది ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆశపడతారు. అయితే ఆర్థిక, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల చాలా మంది తమ చదువులను మధ్యలోనే ఆపేస్తుంటారు. అలాంటి వారిలో మహిళలు, మారుమూల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఉంటారు. ఇలా చదువుకు దూరమైన వారికి, ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలనుకునే వారికి డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ యూనివర్సిటీ ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, డిప్లొమా వంటి అనేక కోర్సులకు అడ్మిషన్లు ప్రకటిస్తుంది. ఇప్పుడు.. ఒక కొత్త నిర్ణయంతో ఈ యూనివర్సిటీ మరింత మందికి చేరువ కానుంది.డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆదివాసీ విద్యార్థులకు ఉచిత విద్య అందించనున్నట్లు ప్రకటించింది. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఈ విషయాన్ని వెల్లడించారు. యూనివర్సిటీ గడిచిన నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మందికి ఉన్నత విద్య అందించినా, ఇంకా కొన్ని వర్గాల ప్రజలు చదువుకు దూరంగా ఉన్నారని, అందులో ముఖ్యంగా ఆదివాసీ తెగలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమస్యను గుర్తించిన యూనివర్సిటీ, వారికి ఉన్నత విద్యను అందించాలని నిర్ణయించుకుంది.యూనివర్సిటీ నినాదంకు అనుగుణంగా, మారుమూల ప్రాంతాల్లో కూడా స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ.. ఆదివాసీలకు ఇంకా పూర్తిస్థాయిలో చేరువ కాలేకపోయామని యూనివర్సిటీ అధికారులు గుర్తించారు. అందుకే వారికి ఆర్థిక భారం లేకుండా, చదువుకు కావలసిన వనరులు అందించడానికి ఈ ప్రణాళికను రూపొందించారు.ఈ పథకం ప్రకారం.. ఆదివాసీ విద్యార్థులు ఎటువంటి బోధనా రుసుముచెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.500 నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో వారు డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చు. అంతేకాకుండా వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తారు. వసూలు చేసే ఆ డబ్బులు కూడా పుస్తకాల కోసమే అని తెలిపారు. రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు వంటి తెగలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం అండగా నిలుస్తుంది. రాబోయే ఐదేళ్లలో కనీసం వెయ్యి మంది ఆదివాసీ విద్యార్థులను పట్టభద్రులుగా చూడాలని యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రణాళిక వల్ల చదువుకు దూరంగా ఉన్న ఆదివాసీ యువత తమ కలలను సాకారం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇటీవల చదువుతో పాటే.. నెల నెలా స్టైఫండ్ పొందేందుకు ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.ఈ ప్రణాళికలో చేరడానికి చివరి తేదీ ఆగస్టు 13. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ హెల్ప్ డెస్క్ లేదా వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. 40-23680333 / 040-23680555.. కాల్ సెంటర్ : 1800 5990 101 లేదా వెబ్ సైట్..ను సంప్రదించవచ్చు.

# టాటా చేతికి అరకు కాఫీ




**విజయనగరం,తెలంగాణ దిశ :**అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కేలా ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే కాకుండా.. మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా ప్రతిష్టాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది ఏపీ ప్రభుత్వం. ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పాడేరులో జరిగిన కార్యక్రమానికి చంద్రబాబు హాజరైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించి ఒప్పందాలు జరిగాయి. ముఖ్యంగా గిరిజనుల జీవనోపాధి, అటవీ ఉత్పత్తుల అమ్మకం, పర్యాటక రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం వంటి 21 అంశాల్లో ఈ ఒప్పందాలు జరిగాయి. ప్రధానంగా అరకు కాఫీ బ్రాండ్ అంతర్జాతీయంగా విస్తరించేందుకు, మార్కెటింగ్ కోసం దిగ్గజ సంస్థ టాటా కంపెనీ జిసిసి తో ఒప్పందం చేసుకుంది.అరకు కాఫీ ఇప్పటికే అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. ఐక్యరాజ్యసమితి నుంచి సైతం ప్రశంసలు అందుకుంది. చింతపల్లి ప్రాంతంలో రెడ్ చెర్రీ రిఫైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడానికి సబ్ కో సంస్థ ముందుకొచ్చింది. విశాఖ మన్యంలో కాఫీ తోటల విస్తరణకు సంబంధించి ఐటీసీ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం చేసుకుంది. గిరిజన మహిళల ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాల్లో విక్రయం కోసం ఫ్రాంటీయర్ మార్కెటింగ్ , ఈజీ మార్ట్ లు ప్రభుత్వంతో ఒప్పందాన్ని చేసుకున్నాయి. అయితే ఈ ఒప్పందాలన్నీ అరకు కాఫీ చుట్టూ జరగడం విశేషం. ఇప్పటికే జాతీయ స్థాయిలో సైతం అరకు కాఫీకి గుర్తింపు లభించింది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కూడా కాఫీ చర్చనీయాంశం అయింది.అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాఫీ సాగు విస్తారంగా సాగుతోంది. ముఖ్యంగా పాడేరు ఏజెన్సీలో 11మండలాల్లోని 2.58 లక్షల ఎకరా ల్లో సాగు చేస్తున్నారు. దీనిపై ప్రత్యక్షంగా 2.46 లక్షల మంది ఆధా రపడి జీవిస్తున్నారు. ఇప్పటికే అరకు కాఫీకి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. ఏకంగా పార్లమెంటులోనూ అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు తాజాగా అంతర్జాతీయ స్థాయిలో అరకు కాఫీ దూసుకెళ్లేలా ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు జరగడం విశేషం. సదరు సంస్థలు అనుకున్న స్థాయిలో అరకు కాఫీని ప్రమోట్ చేయగలిగితే.. అరకు కాఫీ అంతర్జాతీయంగా దూసుకెళ్లడం ఖాయం.

## పాఠశాల ఇలా.. పాఠాలు బోధించేది ఎలా..!



**కృష్ణ,తెలంగాణ దిశ:** పాఠశాల నుంచే ఉత్తమ పౌరులు.. సమాజాన్ని బాగు చేసే ఉత్తమ విద్యార్థులు తయారవుతారు. పాఠశాలల్లో మౌలిక వసతులు ఎంత మెరుగ్గా ఉంటే విద్యార్థులను అంత ఉన్నతంగా తీర్చదిద్దగలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
కానీ కృష్ణ మండలం గురజాల ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉంది. ఇక్కడ సుమారు 60 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో చినుకు పడితే చాలు పాఠశాల చిత్తడిగా మారుతుంది. పాఠశాల బిల్డింగ్ పై కప్పు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో పాఠశాల నిర్వహణ ఉందని హెచ్‌ఎం గంగాధర్ దిశతో చెప్పారు. ప్రాణభయంతో పాఠశాల నిర్వహణ కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పామాయిల్ మొక్కలు నాటిన మంత్రి శ్రీధర్ బాబు


**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ :** జిల్లాలోని కాటారం మండలం ధన్వాడ గ్రామంలో రాష్ట్ర ఐటీ శాఖ, పరిశ్రమల మాత్యులు శ దుద్దిల్ల శ్రీధర్ బాబు మెగా ఆయిల్ ప్లాంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి, ఏ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో, తన సొంత వ్యవసాయ క్షేత్రంలో 11 ఎకరాలలో ఆయిల్ పామ్ పంటని మొదటగా మొక్క నాటి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంలో గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం పట్ల చాలా రకమైనటువంటి చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందని, రైతులకి ఆర్థికంగా ఎదిగే అవకాశాలను చాలా వరకు కల్పిస్తుందని, నీటి వసతి కలిగిన ప్రతి రైతు ప్రత్యామ్నాయ పంటల వైపుగా ఈ ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన తెలపడం జరిగింది. రైతులు ఈ ఆయిల్ పామ్ పంటలో అంతర పంటలుగా మిరప, పత్తి, మొక్కజొన్న మరియు ఇతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది గనుక రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఈ పంటని ప్రోత్సాహాలు కల్పిస్తూ రైతులకి వెన్నుదన్ను గా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్, ఉద్యాన శాఖ అధికారి మని, మాజీ ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, పిఏసిఎస్ డైరెక్టర్ మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# వేగంగా అడుగులు వేస్తున్న చంద్రబాబు...



**విజయవాడ,తెలంగాణ దిశ :** నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు 95 సీఎం అంటూ దూసుకుపోతున్నారు. గత మూడు పర్యాయాలకు భిన్నంగా వ్యవహరిస్తూ, వినూత్న రాజకీయాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, పెట్టుబడులను ఆకర్షించి కొత్త ఉద్యోగాలు సృష్టించడం అన్న లక్ష్యాలతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారు. గడిచిన 14 నెలలుగా పాలనలో సంస్కరణలు తీసుకువచ్చిన చంద్రబాబు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టానని అంటున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలకు డబ్బు కేటాయించి వైసీపీ విమర్శలు తిప్పికొడుతున్నారు. తన పనితీరుతో అందరితో శభాష్ అనిపించుకోవాలని తాపత్రయపడుతున్న సీఎం.. సొంత కేడర్ నుంచి ఎదురవుతున్న విమర్శల నుంచి తప్పించుకోలేకపోతున్నారని అంటున్నారు. ఏడాది క్రితం 4.ా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబుపై విపక్షం కన్నా ఎక్కువగా స్వపక్షమే విమర్శలు గుప్పిస్తోంది. 95 సీఎం అంటూ వేగంగా అడుగులు వేస్తున్న చంద్రబాబు.. కార్యకర్తలను సంతృప్తి పరిచే నిర్ణయాలు తీసుకోవడంలో ఎడతెగని జాప్యం చేస్తున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. దీనికి టీడీపీ సోషల్ మీడియా వేదికలనే ఉదాహరణగా చెబుతున్నారు. రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు నాన్చుడు ధోరణిపై సోషల్ మీడియా సైనికులు అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి మండిపడుతున్నారు. అయితే సోషల్ సైనికులు ఒత్తిడికి తలొగ్గి తొందరపాటు నిర్ణయాలు తీసుకోలేమని పార్టీ పెద్దలు తొలుత చెప్పుకొచ్చారు. సొంత వారి విమర్శల నుంచి చంద్రబాబును రక్షించే ప్రయత్నం చేశారు. అయితే ఏడాది అయినా ఈ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సోషల్ మీడియా శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు అధికార చట్రంలో బంధీ మరోవైపు తాను పూర్తిగా మారిపోయినట్లు చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు.. మళ్లీ అధికారుల చట్రబంధంలోకి క్రమంగా ఇరుక్కుంటున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీ కార్యకర్తలకు చంద్రబాబుకు మధ్య యథావిధిగా గ్యాప్ వచ్చేస్తోందని అంటున్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కార్యకర్తలకన్నా అధికార యంత్రాంగానికి ఎక్కువ విలువనివ్వడం వల్ల రాజకీయంగా నష్టపోతున్నామని వ్యాఖ్యలు ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయని చెబుతున్నారు. గత 14 నెలలో సీఎం ఎక్కువగా అధికార కార్యక్రమాలకే ప్రాధాన్యమిస్తున్నారని, కార్యకర్తల సాధకబాధలు తెలుసుకోడానికి అసలు సమయం కేటాయించడం లేదని విమర్శలు ఎక్కువవుతున్నాయి. తాను పూర్తిస్థాయిలో పనిచేస్తున్నా, మంత్రులు, ఎమ్మెల్యేలు సరిగా పనిచేయడం లేదన్న చంద్రబాబు వ్యాఖ్యలపైనా నిరసన వ్యక్తమవుతోందని అంటున్నారు. చంద్రబాబు సీఎంగా వ్యవహరిస్తున్నారే కానీ, పార్టీ అధినేతగా తమ సమస్యలు తెలుసుకోవడం లేదని ఎమ్మెల్యేలు, మంత్రులు అంతర్గత సంభాషణల్లో వాపోతున్నారని చెబుతున్నారు. వచ్చేఎన్నికల నాటికి పేదరికం అంతం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న చంద్రబాబు నియోజకవర్గాల్లో తమ పరిస్థితిని అర్థం చేసుకోకుండా టార్గెట్లు పెట్టడంపైనా ఎమ్మెల్యేలు, మంత్రులు లబోదిబోమంటున్నారని అంటున్నారు. అందుబాటులో లేని అధినేత ఈ సారి పాలనలో తనలో పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిని చూస్తారని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విషయంపైనా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గతంలో ఓ సారి మంత్రి, ఎమ్మెల్యేలతో డిన్నర్ భేటీలు నిర్వహిస్తానని చెప్పిన చంద్రబాబు.. ఒకరోజు మాత్రమే ఆ పనిచేశారని అంటున్నారు. నిత్యం బిజీ షెడ్యూలుతో సీఎం ఉండటం వల్ల పార్టీ పరమైన సమస్యలు, రాజకీయ నిర్ణయాల విషయంలో ఆయనను సంప్రదించడం కుదరడం లేదని అంటున్నారు. పార్టీ పరంగా మంత్రి లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా అందుబాటులో ఉంటున్నా, చంద్రబాబు దృష్టికి తేకుండా ఏ నిర్ణయం తీసుకోలేని వాతావరణం ఉండటం కూడా నియోజకవర్గాల్లో ఇబ్బందులు సృష్టిస్తోందని ఎమ్మెల్యేలు వాపోతున్నారు. దీంతో చంద్రబాబు ఎప్పటిలా వన్ వేలో ప్రయాణిస్తూ తమను వెనక్కి వదిలేస్తున్నారని టీడీపీ ప్రజాప్రతినిధులు లబోదిబోమంటున్నారు.

## ప్రీడయాబెటిస్ నయమైతే,58% తగ్గనున్న 'గుండె' ముప్పు!



లండన్: ప్రీడయాబెటిస్‌ను నయం చేసుకోగలిగిన వారికి హృదయ సంబంధిత వ్యాధుల ముప్పు 58 శాతం మేరకు తగ్గుతుంది. లండన్‌లోని కింగ్స్ కాలేజ్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. రక్తంలో చక్కెర స్థాయి సాధారణం కన్నా అధికంగా ఉండటాన్నే ప్రీడయాబెటిస్ అంటారు. ఇది పూర్తి స్థాయి మధుమేహం కాకపోయినప్పటికీ, తీవ్రమైన గుండె సమస్యలకు దారి తీయవచ్చు. ప్రీడయాబెటిస్‌ను నయం చేసుకుంటే, తక్షణ గుండె పోటు ముప్పును తగ్గించుకోవడం మాత్రమే కాకుండా దీర్ఘ కాలంలో గుండెను కాపాడుకోవచ్చునని అధ్యయనకర్తలు తెలిపారు. వైద్య సలహా మేరకు మెరుగైన ఆహారాన్నితీసుకోవడం,ఎక్కువగాకదలడం, బరువును తగ్గించుకోవడం వంటి కార్యకలాపాలను చేయాలని సూచించారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌ఛార్జి అంబాల నరేష్ మాదిగ



**పెద్దపల్లి,తెలంగాణ దిశ** :నిరాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఎంఆర్‌పీఎస్ పెద్దపల్లి మండల ఇన్‌ఛార్జి అంబాల నరేష్ మాదిగ విమర్శించారు. శు క్రవారం పెద్దపల్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన, వృద్ధులు, వితంతువు లు, వికలాంగుల పెన్షన్‌ను రెట్టింపు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ పెన్షన్ పెంపు విషయంలో జాప్యం చేయడం పై మండిపడ్డారు. పెద్దపల్లిలో మీడియాతో మాట్లాడిన నరేష్ చేయూత పెన్షన్ దారుల ఆగ్రహానికి గురికాకముందే రేవంత్ రెడ్డి సర్కారు వెంటనే మేల్కోవాలని హితవు పలికా రు. వృద్ధులకు రూ.4వేలు, వితంతువులకు రూ.4వేలు, గీత కార్మికులకు, బీడీ కార్మికు లకు రూ. 4వేలు, వికలాంగు లకు రూ.6వేల చొప్పున పెంచిన పెన్షన్ మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 20 నెలల బకాయిలను కూడా వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ చర్యలను తక్షణమే చేపట్టడం ద్వారానే ప్రభుత్వం వృద్ధులు, వితంతు వులు, వికలాంగుల అభిమా నాన్ని చూరగొనగలుగుతుందని అంబాల నరేష్ మాదిగ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రారండోయ్.. పసందైన విందిస్తాం!





**గజిబిజి సిటీలైఫ్‌లో మనవైన రుచులు మర్చిపోతున్నాం. ఆఫీస్ నుంచి వస్తూ జంక్‌ఫుడ్ తినేస్తున్నాం. వీకెండ్స్‌లో హోటల్ తిండినే మృష్టాన్న భోజనం అని సరిపెట్టుకుంటున్నాం. ఉద్యోగాల పేరుతో.. ఇంటికి దూరంగా వచ్చిన వారి గురించైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మిమ్మల్ని ఎవరైనా ఇంటికి పిలిచి షడ్రసోపేతమైన విందు ఇస్తామంటే ఎలా ఉంటుంది. 'కాజ్ వై నాట్?' అదే చేస్తున్నది. ఇద్దరు అమ్మాయిల ఆలోచనలోంచి పుట్టిన ఈ సొల్యూషన్ ఇంటి వంటతో పసందైన విందు ఇస్తూనే, అనుబంధాలు విరిసే సరికొత్త సంప్రదాయానికి తెరతీసింది. సిటీలో నయా కల్చర్‌కు శ్రీకారం చుట్టిన సహన, శ్రీమయిల ఆ ఘుమఘుమలే ఇవి..**

కరీంనగర్‌కు చెందిన పెద్ది సహన, మంచిర్యాలకు చెందిన రేణికుంట శ్రీమయి ఇద్దరూ దగ్గరి బంధువులు. పై చదువుల కోసమని జర్మనీకి సహన వెళ్లాల్సి వచ్చింది. అక్కడ తిండి తిప్పలు తట్టుకోలేక.. తన వంట తనే చేసుకునేది. చదువు ముగించుకొని హైదరాబాద్‌లో వ్యాపారం మొదలుపెట్టింది. ఎంత కష్టపడితే మాత్రం ఏముంది? రుచికరమైన ఆహారం లేక ఇబ్బందిగా ఫీలయ్యేది. వారంలో ఒక్కరోజైనా ఇంటి వంట తినాలనీ, స్నేహితులతో సరదాగా గడపాలనీ ఆమె ఆలోచన. ఏ రెస్టారెంట్‌కు వెళ్లినా.. ఇంటి రుచి దొరకలేదు ఆమెకు. స్నేహితులు ఎవరి బిజీలో వాళ్లు ఉండటంతో నలుగురితో కలిసే అవకాశమే గగనమైపోయింది. జీవితం ఇలా కృత్రిమంగా సాగిపోవడం సహనకు నచ్చలేదు. అదే సమయంలో హైదరాబాద్‌లో బీబీఏ ఫైనలియర్ చదువుతున్న శ్రీమయి ఆమెకు తోడైంది. ఇద్దరూ కలిసి మంచి భోజనం కోసం రోజంతా వెతికేవారు. అయినా వాళ్ల అభిరుచికి తగ్గ రుచి ఎక్కడా చవిచూడలేకపోయారు.

**వారే వండి వడ్డిస్తారు..:** రుచీపచీ లేకుండా రోజులు భారంగా సాగుతున్నాయి. ఈ మహానగరంలో తమలాగే ఇంటి భోజనం కోసం పరితపించేవాళ్లు ఎందరో ఉంటారు కదా అనుకున్నారు ఇద్దరు. మనమే వారికి అలాంటి ఫుడ్ ఎందుకు అందివ్వకూడదు అని 'కాజ్ వై నాట్?' ప్రారంభించారు. ఇంటికి దూరంగా ఉంటూ చప్పిడి తిండి తింటున్నవాళ్లందరికీ మేలైన రుచులు పంచాలని భావించారు. నెలలో రెండు శనివారాలు అతిథులకు ఆహ్వానం పలకాలని నిశ్చయించుకున్నారు. సోషల్ మీడియా వేదికగా 'కాజ్ వై నాట్?' పిలుపు ఇచ్చారు. తమ స్వహస్తాలతో రుచికరమైన పదార్థాలు చేసి, ఇంట్లోనే కూర్చుని, కులాసాగా కబుర్లు చెప్పుకొంటూ విందు ఆరగించే ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఎవరూ రారేమో అనుకొని తమ స్నేహితులనే ఆహ్వానించి విందు చేశారు. తిన్నవాళ్లంతా మెచ్చుకోవడంతో ప్రయాణాన్ని ముందుకు కొనసాగించారు.

**అదిరిపోయే మెనూ:** ప్రతి ఈవెంట్‌కు 10 నుంచి 20 మంది మాత్రమే హాజరయ్యేలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. నామమాత్రంగా రుసుం వసూలు చేస్తారు. వీరి పిలుపు అందుకొని ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు బాగానే స్పందిస్తున్నారు. మాదాపూర్, హైటెక్ సిటీ ఏరియాల్లో ఉన్న తమ బంధువుల ఇంటిని వెన్యూగా ఫిక్స్ చేస్తుంటారు సహన, శ్రీమయి. ప్రతిసారీ ఒకేరకమైన వంటకాలు కాకుండా సరికొత్త థీమ్‌లతో విందులు పంచుతున్నారు. శనివారం ఉదయాన్నే ఇద్దరూ రంగంలోకి దిగుతారు. తాజా కాయగూరలు తెచ్చి, స్వయంగా అనేక రకాల పదార్థాలూ వండేస్తారు. సాయంత్రానికి బిలబిలమంటూ అతిథులు వచ్చేస్తారు. పరిచయాలు పూర్తయ్యాక.. అరిటాకు వేసి మరీ భోజనాలు పెడతారు. కోరిన పదార్థాన్ని కొసరి కొసరి వడ్డిస్తారు. అప్పడాలు తింటూ, ముచ్చట్లు చెప్పుకొంటూ సందడిగా విందారగిస్తారంతా. పదార్థాల విషయంలో సంప్రదాయ వంటకాలకు పెద్దపీట వేస్తున్నారు సహన, శ్రీమయి. మక్క గట్క, అంబలి, ఉల్లికారం, ఎల్లిపాయ కారం, ముద్దపప్పు ఇలా.. పసందైన పదార్థాలు వండి వడ్డిస్తున్నారు.

**తక్కువ కాలంలోనే..:** తల్లిదండ్రులకు దూరంగా ఉద్యోగాలు చేసుకుంటూ, పై చదువులకోసమని హైదరాబాద్ నగరంలో జీవిస్తున్న వాళ్లకు అమ్మ చేతివంటను పరిచయం చేస్తున్న 'కాజ్ వై నాట్?' ప్రస్థానం మొదలై ఐదు నెలలే అయింది. ఎప్పుడెప్పుడు శనివారం వస్తుందా అని అతిథులు ఎదురు చూసేంతగా వీళ్లకు పేరొచ్చింది. ప్రస్తుతం నెలకు రెండు శనివారాలే అందిస్తున్న ఆతిథ్యం.. నాలుగు వారాలకు పెంచాలనే యోచనలో ఉన్నారు సహన, శ్రీమయి. అంతేకాదు హైటెక్‌సిటీ, మాదాపూర్‌కే పరిమితమైన వెన్యూలు నగరవ్యాప్తం చేయాలనే ఉద్దేశంతోనూ ఉన్నారు. ఈ ఇద్దరి ప్రయత్నం చవులూరించే విందును అందివ్వడమే కాకుండా.. ముచ్చటైన బంధాలకు వేదికగా నిలుస్తుండటం విశేషం.

## అన్వేష్ కోసం ముమ్మర దర్యాప్తు

### ఇన్‌స్టాగ్రామ్ నిర్వాహకులకు పోలీసుల లేఖ

**హైదరాబాద్,తెలంగాణ దిశ** :యూట్యూబర్ అన్వేష్‌పై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అన్వేష్ యూజర్ ఐడీ వివరాలు సమర్పించాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్ నిర్వాహకులకు పోలీసులు లేఖ రాశారు. ఇన్‌స్టాగ్రామ్ నుంచి సమాధానం కోసం పోలీసులు వేచి చూస్తున్నారు. కాగా.. ఇటీవల హిందూ దేవతలపై అన్వేష్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. విదేశాల్లో ఉంటూ దేవీదేవతలపై అన్వేష్ వివాదాస్పద కామెంట్స్ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అన్వేష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ వ్యాఖ్యలపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అన్వేష్‌పై సినీనటి, బీజేపీ నేత కరాటే కళ్యాణి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిపై బీఎన్ఎస్ సెక్షన్లు 352, 79, 299, ఐటీ చట్టంలోని 67 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అలాగే తెలంగాణ వ్యాప్తంగా కూడా అన్వేష్‌పై వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. అన్వేష్‌ను వెంటనే భారత్‌కు రప్పించాలని... అరెస్ట్ చేయాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. హీరోయిన్ల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన కామెంట్స్‌ను నిరసిస్తూ అన్వేష్ ఓ వీడియో చేశారు. అంతా బానే ఉంది. కానీ ఆ వీడియోలోనే హిందువులు దేవతగా కొలిచే సీతమ్మ వారితో పాటు ద్రౌపదిపై అన్వేష్ జుగుప్సకరమైన వ్యాఖ్యలు చేశారు. దీంతో హిందూ సంఘాలతో పాటు నెటిజన్లు కూడా ఆ వీడియోపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

# కాపు దళిత నినాదంతో కొత్త పార్టీ

**విజయవాడ,తెలంగాణ దిశ** : ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై మరో కొత్త అధ్యాయం మొదలుకానుందా? గడిచిన ఎన్నికల్లో కూటమి ప్రభంజనం ముందు డీలాపడ్డ ప్రతిపక్షం.. ఇప్పుడు సరికొత్త వ్యూహానికి తెరలేపుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం జోరుగా సాగుతున్న ప్రచారం ప్రకారం.. ఏపీలో కాపు, దళిత సామాజిక వర్గాల కలయికతో ఒక కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ వ్యూహ రచన, దివంగత నేత వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశ భాగస్వామ్యంతో ఈ కొత్త శక్తి తెరపైకి రాబోతోందని విశ్వసనీయ సమాచారం.కొంతకాలం క్రితం సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. "కాపులు, దళితులు ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం సాధ్యం. కాపు సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి పీఠం, దళితులకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కాలి" అనేది ఆయన ప్రతిపాదన. ఒక మాజీ అధికారిగా కాకుండా, ఒక పొలిటికల్ స్ట్రాటజిస్ట్ లా ఆయన చేసిన ఈ వ్యాఖ్యల వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందనేది బలంగా వినిపిస్తున్న ఆరోపణ. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతలు నిర్వర్తించి, ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ముద్ర పడిన సునీల్ కుమార్.. ఇప్పుడు తెరవెనుక ఉంటూ ఈ కొత్త రాజకీయ ప్రయోగానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ కొత్త సమీకరణంలో ప్రధాన ఆకర్షణ వంగవీటి ఆశ. దివంగత వంగవీటి మోహన రంగాకు కాపు సామాజిక వర్గంలో ఉన్న ఆరాధన భావం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇటీవల విశాఖలో నిర్వహించిన 'రంగా సేన' ఆత్మీయ సమ్మేళనం ఈ కొత్త పార్టీ ఊహాగానాలకు ఊపిరి పోసింది. ఈ సభలో కాపులతో పాటు దళితులు, బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగా ఆశయ సాధన కోసం కొత్త వేదిక అవసరం అని మెజారిటీ కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేయడం గమనార్హం. వంగవీటి రాధా రాజకీయంగా మౌనంగా ఉంటున్న తరుణంలో, రంగా వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఆయన ఇమేజ్ ద్వారా కాపు యువతను ఆకర్షించడానికి వంగవీటి ఆశను ముందు పెడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడానికి ప్రధాన కారణం కాపు ఓట్ల ఏకీకరణ. పవన్ కళ్యాణ్ చొరవతో కాపు ఓట్లు గంపగుత్తగా కూటమికి పడ్డాయి. ఇది వైసీపీని కోలుకోలేని దెబ్బ తీసింది. వచ్చే ఎన్నికల నాటికి ఈ ఓటు బ్యాంకును చీల్చకపోతే వైసీపీకి భవిష్యత్తు కష్టమే. అందుకే, నేరుగా వైసీపీలో చేరలేని కాపు, దళిత వర్గాలను ఆకర్షించడానికి ఒక మూడో ప్రత్యామ్నాయం లేదా కొత్త పార్టీ అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే.. రంగా సెంటిమెంట్ ను వాడుకుని కాపు ఓట్లను చీల్చడం, దానికి దళిత ఓట్లను జత చేయడం ద్వారా కూటమి ఓటు బ్యాంకుకు గండి కొట్టాలనేది మాస్టర్ ప్లాన్ గా కనిపిస్తోంది.

పీవీ సునీల్ కుమార్, వంగవీటి ఆశలతో పాటు మరికొందరు వైసీపీ సానుభూతిపరులు, మేధావులు ఈ పార్టీలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.అయితే, కేవలం సామాజిక సమీకరణాలతో పార్టీని నడపడం అంత సులభం కాదు. వంగవీటి ఆశకు క్షేత్రస్థాయిలో రాజకీయ అనుభవం తక్కువ. పవన్ కళ్యాణ్ లాంటి ఛరిష్మా ఉన్న నేత ముందు ఆమె ఎంతవరకు నిలబడగలరనేది ప్రశ్న. గతంలో కాపు, దళిత సామాజిక వర్గాలను ఏకం చేయడానికి జరిగిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి.

బీఎస్పీ-జనసేన పొత్తు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఈ రెండు వర్గాల మధ్య క్షేత్రస్థాయిలో ఉన్న అంతరాలను చెరిపివేయడం కత్తి మీదసాము లాంటిది. అన్నిటికీ మించి ఈ కొత్త పార్టీ వెనుక జగన్ మోహన్ రెడ్డి ఉన్నారనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళితే, అది అంతిమంగా ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.మొత్తానికి, ఏపీలో మరో కొత్త పార్టీ ఆవిర్భావానికి రంగం సిద్ధమవుతోందన్నది కాదనలేని సత్యం. వచ్చేఎన్నికల నాటికిపూర్తిస్థాయిలోయాక్టివ్ అయ్యేలా గ్రౌండ్ వర్క్ జరుగుతోంది. ఇది కేవలం ఓట్ల చీలిక కోసమే పుడుతోందా? లేక నిజంగానే బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యామ్నాయ వేదిక అవుతుందా? అనేది కాలమే నిర్ణయించాలి.

# ఏ వలువల విలువలు తెలుసుకోండి

## స్వేచ్ఛ.. అంటే అర్ధనగ్న ప్రదర్శన కారాదు

రచన: లక్ష్మీ మదన్

**గజ్వేల్,తెలంగాణ దిశ** :ఇంటి నుండి క్రమశిక్షణ మొదలవుతుంది. బాల్యంలో తల్లి మార్గదర్శి. ఆమె ఏం చెప్పినా పిల్లలు తప్పకుండా పాటిస్తుంటారు. ఆ తర్వాత తండ్రి పాలనలో పిల్లలు ఎన్నో నేర్చుకుంటున్నారు. ఇది మన భారతీయ సంస్కృతి. విద్య, వినయం, వస్త్రధారణ ఇవన్నీ ముందుగా తల్లి ద్వారా పిల్లలు నేర్చుకుంటారు. ముఖ్యంగా పిల్లలు తల్లిని గమనిస్తుంటారు. ఆమె కట్టు బొట్టును ఇష్టపడతారు. ఏమరు పాటులో ఎప్పుడైనా తల్లి ముఖంలో బొట్టు కనబడకపోతే చిన్నారి చేతులతో బొట్టు తెచ్చి పెడతారు. ఇది అందరికీ అనుభవమే. చీర కొంగు కాస్త పక్కకు జరిగితే, ఆ బిడ్డడు ముఖ్యంగా మగ పిల్లవాడు తల్లి కొంగు సరి చేస్తాడు. వాడికి తెలియకుండానే తల్లి బాగుండాలి అని కోరుకుంటాడు. ఇవన్నీ ఏ రాజ్యాంగం లోనూ రాసి ఉండవు. కాలక్రమేణా నేర్చుకుంటున్నాము. అనాదిగా ఆకులు కట్టుకున్న మనిషి మెల్లమెల్లగా వస్త్రాలను ధరించడం ఎలా నేర్చుకున్నాడో ,అలాగే నెమ్మదిగా ఈ తరంలో కొందరు ముందుకు వెళ్లకుండా మళ్లీ ఆదిమానవుడి వైపు వెళ్ళిపోతున్నారు. స్వేచ్ఛ అనేది ఒకరు ఇస్తే వచ్చేది కాదు. మనకి మనం నియంత్రించుకునేది. 'నీ ఇష్టం వచ్చినట్లుగా ఉండు' అని చెప్తే, పరిమితులు దాటి ఉండమని చెప్పడం కాదు. నువ్వు ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలి అని అర్థం. నీ శరీరాన్ని నలుగురిలోకి వెళ్ళినప్పుడు ఎలాంటి దుస్తులతో అలంకరించుకోవాలి అనేది ఆలోచించుకోవాలి. నలుగురిలోకి వెళితే నీకు నచ్చిన బట్టలు కాదు కట్టు కోవాల్సింది. ఏ వలువ ధరిస్తే విలువ పెరుగుతుందో అది ఆలోచించు కోవాలి. అలాగని చీరలే కట్టుకోవాలి అనే సిద్ధాంతం ఎక్కడా లేదు. నిండుగా ఉన్న ఏ వస్త్ర ధారణ ఏదైనా స్త్రీకి అందమే! ఇంట్లో తల్లిదండ్రులకు కూడా పిల్లల వస్త్రధారణ గురించి చెప్పే హక్కు లేదు అనడం ఎంతవరకు సబబు? రేపు ఆ పిల్లలు ఏ విధంగానైనా నష్టపోతే తల్లిదండ్రులకే కదా బాధ కలిగేది. ఇలా మాట్లాడిన వాళ్లు వచ్చి రక్షణ కల్పిస్తారా? కొందరు వితండ వాదనలు చేస్తారు. ఎన్నో ఆకృత్యాలు పిల్లలు వృద్ధుల మీద జరుగుతున్నాయి. మరి వాళ్లే దుస్తులు ధరించారని? అని. దానిని ఈ విషయంతో ముడి పెట్టవద్దు. మనిషి మృగంగా మారినప్పుడు అలాంటి ఆకృత్యాలు జరుగుతాయి. సమాజంలో ఉన్నప్పుడు మనిషి లోపల ఉన్న వికృతమైన కోరికను స్పృషించడం ద్వారా తీర్చుకోవాలని ప్రయత్నం చేస్తాడు. నా స్వేచ్ఛ నా ఇష్టం అనేది ఎవరికి వర్తించదు. ఆ స్వేచ్ఛ కావాలనుకుంటే ఇంటి వరకే పరిమిత చేసుకోవాలి. సభ్య సమాజంలో ఉన్నప్పుడు కొన్ని పరిమితులను పాటించాలి. అర్ధనగ్న వస్త్రధారణ చేసుకొని, వారితోపాటు రక్షించే వారిని వెంట తీసుకొని వెళ్లాలట? ఆ వెంట తీసుకెళ్లే రక్షకుల బదులుగా నిండుగా వస్త్రం కప్పుకుంటే ఎంతో మేలు కదా! చిన్న విషయాన్ని అంత పెద్దదిగా ఎందుకు ఆలోచించాలి? విలువైన వస్తువులన్నీ లాకర్లలో పెట్టుకుంటాము. ఇంట్లో భద్రంగా దాచుకుంటాము. కానీ శరీర భాగాలు అంతకన్నా విలువ లేనివా? వాటిని నిర్లజ్జగా ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం? ప్రతి ఒక్కరూ న్యాయం వైపు స్పందిస్తారు. అలాగే న్యాయం వైపే స్పందించారు. ఒక మహిళ మరో మహిళను సపోర్టు చేయడానికి ఇష్టపడుతుంది. కానీ పరిమితులు దాటిన మహిళలను ఏ మహిళ సపోర్ట్ చేయడానికి ఇష్టపడదు. మన ఇంట్లో నాన్న ,అన్న, తమ్ముడు, కొడుకు ఎవరికైనా మనకి హితవు చెప్పే హక్కు ఉంది. ఎందుకంటే వారిలో ప్రేమ, ఆప్యాయత తమ వారి రక్షణ బాధ్యత ఇవన్నీ ఉంటాయి. తన వారికి ఏమైపోతుందో అనే ఆందోళన కూడా ఉంటుంది. ఫలానా వారి ఇంటి ఆడపిల్ల అంటే గౌరవంగా చూడాలి అని ఆకాంక్ష కూడా ఉంటుంది. అదంతా తప్పేమీ కాదు. దానిని భూతద్దంలో నుండి చూసి స్పందించాల్సిన అవసరం లేదు. అవును మన వాళ్లు మనకు చెప్పే తీరుతారు. అలాగే సమాజంలో అలాంటి స్థానాన్ని తీసుకొని మంచి చెప్తే అర్థం చేసుకొని ఆచరించి చూపించాలి. అంతేకానీ పంతానికి పోయి మరింత నిర్లజ్జగా వ్యవహరిస్తా మంటే రేపు నష్టపోయేది వారే. రేపటి తరానికి వారు చేయబోయే నష్టం చాలా ఎక్కువ. రేపు వారి పిల్లల దృష్టిలో కూడా చులకన అయిపోతారు. ఇలా ఆలోచిస్తే ఏ మహిళ అసహ్యమైన దుస్తులు వేసుకొని నలుగురులోకి రారు. ఆడవాళ్ళకే ఆంక్షలా? అనే ప్రశ్న వేస్తున్నారు. మరి ఎక్కువగా ఆడవాళ్ళకే నష్టం జరుగుతుంది. ఇంట్లో తల్లిదండ్రులు మగవాళ్ళకి కూడా చెప్పే తీరుగా చెప్తుంటారు. కానీ నలుగురిలో ఒక వస్త్రం జారిపోతే మగవాడు పెద్దగా ఇబ్బంది పడడేమో! మరి అదే స్త్రీ కి ఎలా ఉంటుంది? ప్రాణం పోయినట్లుగా అనిపిస్తుంది. ఇక విషయం మీద మహిళలతో పాటు పురుషులు కూడా మంచిగా స్పందిస్తున్నారు అంటే ఇంకా అర్థం కావడం లేదా? మా స్వేచ్ఛ మాకు ఉండాలి అని అనుకున్నప్పుడు అవతల చూసే వారి కళ్ళు వాళ్ల స్వేచ్ఛ కోరుకుంటాయి! వెనకట ఒక సామెత ఉంది చింత కాయలకు ఆజ్ఞ కాని, గుటకలకు కాదు కదా అని! అంటే ఒక చెట్టుకు చింతకాయలు ఉంటే అవి కోసుకుంటే మనం ఉల్లంఘన చేసినట్లే. కానీ అవి చూసి నోరూరుతే ఆ తోటమాలికి అవసరం లేదు కదా! ఇది ఈనాటి సామెత కాదు ఏనాటిదో! మన పెద్దలు ఇలాంటివి ఊరికనే చెప్పారా? నీ వస్త్రధారణ చూసి అవతలి వారు గుటకలు వేయడంలో వారి స్వేచ్ఛ అది.. మహిళా వాదులం అంటూ ఇష్టమున్న వ్యాఖ్యలను చేయడం మానుకొని, సమాజానికి ఏది ఉపయోగమో అది చేయండి. ఎంతోమంది మహిళా వాదులు చాలా మంచిగా విషయాలు అర్థం చేసుకుని సమాజానికి వివరిస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామం. ఎక్కడ ఆడవాళ్లు గౌరవింప పడతారో అక్కడ దేవతలు పూజింపబడతారు. గౌరవింపబడేలాగా మనం ఉండాలి. అలాగే మగవారి దృష్టి కోణం కూడా మారాలి.

# ఆరావళికి విజయోస్తు !



ఆరావళిపై సాగుతున్న అరాచకంపై ప్రజలు మేల్కొని ఉద్యమబాట పట్టడంతో కథ అడ్డం తిరిగింది. అంటే ప్రజా ఉద్యమాలకు బలం ఉందని తేలింది. ప్రజా ఉద్యమాలను న్యాయస్థానాలు సైతం అంగీకరిస్తున్నాయి. అందువల్ల సమస్యలపై ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై పోరాటం చేయాల్సిందేనని ఆరావళి మనకు హెచ్చరించింది. ఇది ఆరంభంగా తీసుకోవాలి. దేశంలో ఎక్కడిక్కడ ప్రజలు దేశ పర్యావరణ విధ్వంసంపై ఉద్యమించాలి. నదుల అనుసంధనం ద్వారా నీటి వృధాను అరికట్టేందుకు నడుం బిగించాలి. క్యాన్సర్ కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. అన్నింటికి మించి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం అవసరం. ఇదంతా ఎందుకు చర్చించుకోవాలంటే ఆరావళిని కార్పోరేట్లకు ధారాదత్తం చేయాలన్న ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సుప్రీం ఆదేశాలతో అక్కడ తవ్వకాలకు స్వస్తి పలికింది. సహజసిద్దంగా, భారత్‌కు రక్షణ గోడలా ఉన్న ఆరావళి పర్వతాల్లో తవ్వకాలకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలు, ప్రజలు, మేధావులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ అనుకూల మీడియా సైతం వ్యతిరేకించడం విశేషం. ప్రజాందోళనలు అంతకంతకూ మృగ్యమైపోతున్న ప్రస్తుత కాలంలో ఉదయ్‌పూర్ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమం రాజుకోవడం, పర్యావరణవేత్తలు, సామాన్య ప్రజలు అనే తేడా లేకుండా తమను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆరావళిని కాపాడేందుకు నడుం బిగించారు. కార్పొరేట్ లాభాలు తాత్కాలికమైనవి. పర్యావరణ నష్టాలు శాశ్వతమైనవని గుర్తించారు. అందుకే ఆరావళి జోలికి రాకుండా ఉద్యమించారు. ఢిల్లీ కాలుష్యంలో ఊపిరిసలుపక అవస్థలు పడుతున్న కేంద్ర పెద్దలు అరావళిని తమ తాబేదార్లకు తెగనమ్మే దిశగా అడుగులు వేయడం విస్మయం కలిగించక మానదు. ఎందుకంటే ఇప్పటికీ ఢిల్లీ కాలుష్య నివారణపై కదలిక కానరావడం లేదు. కాలుష్యం మూలాలను కనిపెట్టడం లేదు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తున్నా, ప్రజలు ఆందోళన చెందుతున్నా కార్యాచరణ శూన్యం ఈ దశలో ఆరావళిపై జరిగిన పోరాటం గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. ఆలస్యంగానైనా లెంపలు వేసుకుని అరావళి రక్షణపై, ముఖ్యంగా గనుల తవ్వకంపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఉత్తర్వులు జారీచేయడం ప్రజాభీష్టానికి లభించిన ఘనవిజయంగా చూడాలి. ప్రజల నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని నిరూపితం అయ్యింది. ర్యావరణ పరిరక్షణకూ అప్రమత్తతే రక్షణ కవచమని ఇప్పుడు ఆరావళి సాక్షిగా తేలిపోయింది. ఆరావళి పర్వతాలకు ప్రస్తుతానికైతే ముప్పు తప్పింది. కార్పొరేట్ గద్దలకు ప్రకృతి సంపదను దోచిపెట్టాలన్న దురాలోచన వెనుకపట్టు పట్టింది. ఎత్తు పేరుతో పర్యావరణాన్ని చిత్తు చేయాలన్న ఎత్తుగడ ప్రజాగ్రహం ముందు వీగిపోయింది. ఎడతెగని రైతుల పోరాటం ఫలితంగా కార్పొరేట్లకు సాగును కట్టుబానిసను చేయాలన్న పన్నాగం విఫలమై నల్లచట్టాలను వెనక్కి తీసుకున్నట్టే, దేశవ్యాప్తంగా రగులుతున్న ఆరావళి నిరసనలకు తలొగ్గి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వెనక్కి తగ్గింది. ఎక్కడో పర్వతాలు, అడవులు.. ఎవరు తవ్వుకుంటే మనకేమీ అనుకునే రోజులు కావివి. భూమి మీద ఉండే ప్రతి పుట్టా, చెరువూ దేనికవే పర్యావరణ వ్యవస్థలకు ఆయువుగా నిలిచి ప్రాణాధారాలుగా పనిచేస్తాయి. భూమి మీదున్న అతిపురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళికి ఉన్న ప్రాముఖ్యం తెలియంది కాదు. మన పురాణాలు, ఉపనిషత్తులు, వేదాల్లో దీని ప్రస్తావన ఉంది. మన దేశానికి ఉత్తరాన పెట్టని కోటగోడలా నిలుస్తున్న హిమాలయాల కంటే ఆరావళి పర్వతాలే పురాతనమైనవి. దాదాపు 700 కిలోమీటర్ల పొడవున్న ఈ పర్వతశ్రేణి మరో రకంగా రక్షణ దుర్గంలా నిలుస్తున్నది. పడమర నుంచి తూర్పు ప్రాంతాలకు వీచే వేడిగాలుల ప్రభావాన్ని తగ్గించి, థార్ ఎడారి విస్తరణకు లక్ష్మణరేఖలా నిలువడం దీని ప్రత్యేకత. రాజస్థాన్, హర్యానా, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాలను చల్లగా చూసే కొండదేవరగా ఆరావళిని చెప్పుకోవచ్చు. ఇక కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశ రాజధాని ఢిల్లీకి ఊపిరితిత్తుల్లాంటివని చెప్పకతప్పదు. అలాంటి ఆరావళిని కార్పొరేట్, రియల్ ఎస్టేట్ శక్తులు ఇప్పటికే మైనింగ్‌తో, చెట్ల నరికివేతతో చెరపట్టి చేయాల్సిన నష్టం చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వాలు వేల ఎకరాల అడవులను ధ్వంసం చేస్తున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన కేంద్రం మరింతగా దూకుడు పెంచి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని చూసింది. దీనివల్ల మనకు తీరని నష్టం అని తెలిసినా పట్టించుకోలేదు. ఆరావళిని అంగడి సరుకుగా మార్చేందుకు, గనుల తవ్వకానికి రాచబాట పరిచేందుకు మోదీ సర్కార్ చేసని ప్రయత్నాలపై దెబ్బపడింది. వంద మీటర్ల ఎత్తువరకు మాత్రమే తవ్వకాలు జరపొచ్చని, అంతకన్నా ఎత్తున్నవి మాత్రమే పర్వతాలుగా పరిగణించాలని వితండవాదం చేసింది. శాస్త్రీయ విధానంలో ఏది అడవి, ఏది కాదనేది తేల్చిచెప్పాల్సిన కేంద్రమే ఎత్తును బట్టి అనుమతులను నిర్ధారించడం ద్వారా పర్యావరణ విధ్వంసానికి తోవ వేసింది. ఎత్తును బట్టి ఆరావళి పర్వతాలకు నిర్వచనమిచ్చే విధానాన్ని సర్వోన్నత న్యాయస్థానం స్వయంగా నియమించిన కమిటీ కూడా తిరస్కరించింది. దాన్ని తోసిరాజని కోర్టు ముందు సలహాదారుగా ఆ ప్రతిపాదనే ఉంచి పక్కదారి పట్టించింది. అయితే ప్రజా ఉద్యమాన్ని కోర్టు కూడా పరిగణించింది. ఆరావాళి జోలికి వెళ్లవద్దని తేల్చింది. ఆయా రాష్ట్రాలకు సూచనలు చేసింది. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో ఢిల్లీ కాలుష్యంపై ప్రజలు పోరాడాలి. అప్పుడే దేశానికి విముక్తి కలుగుతుంది. కాలుష్యంతో ఢిల్లీలో ఉండలేక పోతున్నానని కేంద్రమంత్రి నితిని గడ్కరీ స్వయంగా చెప్పడం చూస్తుంటే ఢిల్లీలో ఎంతటి దారుణ పరిస్థితులు ఉన్నాయో గమనించవచ్చు. అందువల్ల కేంద్రమే స్వయంగా రంగంలోకి దిగి రాజధానిని కాలుష్యం నుంచి బయటపడేసే మార్గాలను వెతకాలి.

## మహారాష్ట్ర బీడ్ జిల్లాలో దుర్ఘటన

### బావిలోకి దూకి కుమారుడితో సహా తల్లి మృతి

ముంబై, :మహారాష్ట్ర బీడ్ తాలుకాలో లింబారుయ్ గ్రామ సమీపంలోని వస్తీ ప్రాంతంలో దారుణం చోటు చేసుకుంది. మూడున్నరేళ్ల కుమారుడు వేదాంత్‌తో కలిసి కన్నతల్లి ప్రజక్త రామేశ్వర్ దరాడే (23) నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం ఇంటి నుంచి కుమారుడితోపాటు ఆమె బయటకు బయటకు వెళ్లింది. ఇంటికి తిరిగి ఎంతసేపటికి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు వారి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. వారి ఆచూకీ ఎక్కడ లభ్యం కాలేదు. ఇంటికి300 మీటర్ల దూరంలోని బావిలో చూడగా.. రామేశ్వర్ దరాడే విగత జీవిగా పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని.. మహిళ మృతదేహాన్ని వెలికి తీశారు.నూతిలో నీరు అధికంగా ఉండడంతో.. ఆమె కుమారుడి ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో ఐదు విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసి.. నూతిలోని నీటిని బయటకు తీశారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని బావిలో పోలీసులు కనుగొన్నారు. ఆ మృతదేహన్ని సైతం బయటకు తీశారు. ఆ తర్వాత ఈ మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం బిడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడితో కలిసి ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణం తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులను పోలీసులు విచారిస్తున్నారు.

## టూవీలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### ప్రమాదంలో దంపతుల దుర్మరణం

ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహేద్ నగర్‌లో చోటు చేసుకుంది. సూర్యాపేట జిల్లాకు చెందిన తిరుపతిరావు, వెంకటమ్మ దంపతులు ఇటీవల దిల్‌సుఖ్‌నగర్ కొత్తపేటలో నివసిస్తున్న తమ కుమార్తె వద్దకు వచ్చారు. గురువారం సాయంత్రం ట్యాంక్ బండ్ చూసేందుకు వారు బైక్‌పై బయలుదేరారు. మూసారాంబాగ్ హైటెక్స్ మోటర్స్ సమీపంలో..

వెనుక నుంచి వేగంగా వచ్చిన దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డినెరీ బస్సు.. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దంపతులు రోడ్డుపై పడిపోయారు. వారిపై నుంచి బస్సు వెనుక టైర్ వెళ్లడంతో తిరుపతిరావు, వెంకటమ్మ దంపతులు అక్కడికక్కడే మరణించారు.

ఈ ప్రమాదంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే కొత్తపేటలోని మృతుల కుమార్తెకు సైతం ఈ సమాచారం అందించారు.

## ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసయి అప్పులపాలు

### తట్టుకోలేక యువకుడు ఆత్మహత్య




**కామారెడ్డి,,తెలంగాణ దిశ :** ఆన్‌లైన్ గేమ్‌ల వ్యసనం కారణంగా మరో యువకుడు బలయ్యాడు. కామారెడ్డి జిల్లాలోని ఓం శాంతి కాలనీకి చెందిన శ్రీకర్(30) అనే యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లో నష్టాలు రావడం తో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంత కాలంగా శ్రీకర్ ఆన్‌లైన్ బెట్టింగ్స్, రమ్మీ వంటి గేమ్స్‌కు బానిసయ్యా డు. తల్లిదండ్రులు, స్నేహితులు ఎంతగా వారించినా వారి మాటలు పట్టించుకోలేదు. తొలుత చిన్న మొత్తాల్లో లాభాలు రావడంతో.. మరింత ఆశతో బంధువులు, స్నేహితుల వద్ద అప్పుచేసి మరీ ఆడటం మొదలుపెట్టాడు. గత రెండు సంవత్సరాలుగా సుమారు రూ.20లక్షల వరకు ఆన్‌లైన్ గేమ్‌లో నష్టపోయాడని బాధితుడు తల్లి కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీకర్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. అతడు ఏయే యాప్‌లలో ఎంత డబ్బు పోగొట్టుకున్నాడు? ఎవరెవరు అతన్ని వేధించారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. రెండేళ్లుగా ఎన్నో చోట్ల అప్పులు తీసుకున్నాడని.. ఇటీవల అప్పిచ్చిన వాళ్లు తిరిగివ్వాలని ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల డిజిటల్ యాక్టివిటీస్‌పై దృష్టి సారించాలని, బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ గేమింగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# మూడేళ్ల ముందు నుంచే హడావిడి..

**కాకినాడ,తెలంగాణ దిశ :** సాధారణంగా ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీట్లు దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు.. దానికోసం ప్రచార అస్త్రాలతోపాటు ప్రజలతో మమేకమవ్వడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. అధినేతలను, ముఖ్యనేతలను కలుసుకుని తన గుర్తింపును పదిలపరచుకోవడం వంటివి చూస్తుంటాం.. కానీ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ సీపీ లో పరిస్థితి దీనికి భిన్నంగా మారింది.. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల కాలం ఉన్నా వైసీపీ నాయకులు వైసీపీ అసెంబ్లీ సీటు కోసం నానా హైరానా పడుతున్నారు.. బరిలో మేము న్నామంటే మేమున్నామంటూ నియోజకవర్గ సమన్వయకర్తతో సంబం ధం లేకుండా ఎవరికివారు తమ ఉనికిని చాటుకునేందుకు కాపాడుకు నేందుకు వీర ప్రయత్నాలు చేస్తున్నారు.. 2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాజయం తరువాత చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు.. ఇదే తీరు అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలోకూడా కనిపించింది.. అయితే వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మార్పు తరువాత అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది.. అమలాపురం నియోజకవర్గంలో తిరుగులేని పాత్ర పోషించిన మాజీ మంత్రి విశ్వరూప్ నియోజకవ ర్గానికి దూరమవ్వడం.. ఆయన కుమారుడు శ్రీకాంత్ నాయకత్వాన్ని అంగీకరించని కొందరు పార్టీ నేతలు పక్కచూపులు చూడడం.. మొత్తం మీద నియోజకవర్గంలో వైసీపీ ఐక్యతా రాగం బీటలువారి రిజర్వుడు కేటగిరిలో ఉన్న కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.. ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన జగన్ జన్మదిన వేడుకలో ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ అసహనం వ్యక్తం చేస్తూ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయముందని, అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.. అంటే అమలాపురం వైసీపీలో సీటు కోసం హీటు పెరిగిందా అన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.. అమలాపురం పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా పోటీచేసి విజయం సాధించిన మాజీ ఎంపీ చింతా అనురాధ ఇటీవల కాలంలో తన స్పీడు పెంచారు.. మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో నియోజకవర్గానికి చాలా కాలం దూరమయ్యారు.. అయితే ఎన్నికల సమయంలో మాత్రం అడపా దడపా ప్రచారంలో పాల్గొన్న అనురాధ మొత్తం మీద సీఈసీ సభ్యురాలిగా పదవిని తెచ్చుకోగలిగారు. దీంతో అప్పటి నుంచి స్పీడు పెంచిన అనురాధ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.. ఓ పక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రత్యేకంగా తన వర్గంతో పరామర్శల నుంచి పలుకరింపుల వరకు ఒక్క రోజులో అనేక చోట్ల చుట్టేస్తున్నారు.. అంతటితో ఆగక సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎంపీ అనురాధ వెంట నడుస్తున్నవారిలో ఎక్కవ మంది గతంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గమే ఉండడం కనిపిస్తోంది.. ఉప్పలగుప్తంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలో మాజీ మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఫోటోలు లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అక్కడి వారు చింతా అనురాధా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు చెప్పకనే చెప్పినట్లయ్యింది.. గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని తరచూ కలవడం, ఇటీవల జరిగిన జగన్ జన్మదిన వేడుక సందర్భంగా భారీ స్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటిలానే కనిపించినా ఈ ఏడాది అయితే మరింత జోరు పెంచినట్లు కనిపిస్తోంది.. అయితే గత కొన్ని నెలలుగా ఒకప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిలో కొంత మంది రమణారావు వెంట కనిపిస్తున్నారు.. జగన్ అజెండాతో కొంత మంది పార్టీ యువత చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం, నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేయడంతోపాటు ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఉనికిని చాటుకునేందుకు మరింత స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది.. ఇదిలా ఉంటే మాజీ ఎంపీ అనురాధ, రమణారావు పలు కార్యక్రమా లకు కలిసి పాల్గొనడం ఆ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ కానీ, ఇతర ముఖ్యనేతలు కనిపించకపోవడంపై చర్చ సాగుతోంది..నియోజకవర్గంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గంలో చాలా మంది పక్కచూపులు చూడడం ఇంతకాలం అసంతృప్తితోనే ఆయన వెంట నడిచారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఓటమి తరువాత అందులోనూ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాద్యతల మార్పు తరువాత వర్గీయులకు వంక దొరికిందా అన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆశపడి భంగపడ్డ వారు, అధికారంలో ఉన్నప్పుడు తమకేమీ ఉపయోగపడలేదన్న అసంతృప్తితోనే దూరమవుతున్నట్లు కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది.. అయితే ముఖ్య అనుచరగణంలో కొందరు మాత్రం విశ్వరూప్ వెంటే ఉండగా విశ్వరూప్ స్థానికంగా పెద్దగా ఉండకపోవ డంతో వారు ఇటీవలకాలంలో సైలెంట్ అవుతున్నారు. రాబోయే ఎన్నికల పండుగ కోసం ఎదురు చూస్తున్న కొందరు వైసీపీ నాయకులు ముందే కూసిన కోయిల చందంగా ప్రచారార్భాటాలతో దూసుకుపోతుండగా మీరు కోనసీమకు మళ్లీ రావాలంటూఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుకుకొందరువైసీపీ నాయకు లు స్వాగతం పలుకుతున్నారని తెలుస్తోంది.. సోషల్ మీడియా వేదికగా కూటమి నేతలపై విరుచుకుపడుతున్న బొజ్జా ఐశ్వర్యకు వైసీపీ బెర్త్ ఖాయం అంటూ మరికొందరు జోష్యం చెప్పడం నియోజ కవర్గంలో కనిపిస్తోంది.. ఎన్నికలకు చాలా సమయం ఉన్నా మొత్తం మీద అమలాపురం వైసీపీలో మాత్రం సీట్ కోసం హీట్ కనిపిస్తోంది..

# పెరగనున్న రైళ్ల సంఖ్య..




**విజయవాడ,తెలంగాణ దిశ :**రైళ్ల రద్దీని తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న ఐదేళ్లలో దేశంలోని 48 ప్రధాన రైల్వే స్టేషన్ల నుంచి రైళ్ల సంఖ్యను రెట్టింపు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి నడిచే రైళ్ల సంఖ్య రెట్టింపు కానుంది. ప్రస్తుతం 37 రైళ్లు నడుస్తుండగా, ఈ సంఖ్య 74కు చేరుకుంటుంది. రూ.500 కోట్లతో స్టేషన్ అభివృద్ధి, ప్లాట్‌ఫారాల విస్తరణతో పాటు, కొత్త కోచింగ్ డిపో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నం నుంచి నడిచే రైళ్ల సంఖ్య రెట్టింపు అవుతుందని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కేంద్ర రైల్వే శాఖ ప్రకటించింది. ఇదిలా ఉంటే ఇప్పటికే రూ. 500 కోట్లతో విశాఖ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్యను 8 నుంచి 14కు పెంచుతామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నం డివిజన్‌లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని రైల్వే వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 37 రైళ్లు నడుస్తున్నాయి. కేంద్రం నిర్ణయం ప్రకారం, రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య 74కు చేరుకుంటుంది. అంటే, విశాఖ నుంచి డిమాండ్ అధికంగా ఉండే సికింద్రాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి, ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్, కోల్‌కతా, రాయ్‌పూర్ వంటి నగరాలతో పాటు, అరకులోయ వంటి పర్యాటక ప్రాంతాలకు కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయి. వీటితో పాటు విశాఖ నుంచే కాశీ వంటి పుణ్యక్షేత్రాలకు కూడా రైళ్లు నడిచే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే తిరుపతి, బెంగళూరులకు వందేభారత్ రైళు నడపాలనే ప్రతిపాదనలు కూడా కార్యరూపం దాల్చుతాయి. విశాఖపట్నం రైల్వే స్టేషన్ రద్దీగా మారింది. ఇక్కడ లైన్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో, కొన్ని రైళ్లు దువ్వాడ దాటిన తర్వాత స్టేషన్ బయటే ఆగిపోతున్నాయి. మరికొన్ని రైళ్లను ఒకటి, 2 రోజుల తర్వాత షెడ్యూల్ చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో వాటిని నిలిపి ఉంచడానికి సరైన చోటు లేక, నగర శివారు మార్గాల్లో ఖాళీగా ఉన్న లైన్లలో వాటిని నిలిపి ఉంచుతున్నారు. దీనివల్ల రైళ్ల నిర్వహణ కష్టమవుతోంది.అయితే ఈ సమస్యలకు పరిష్కారంగా.. జగన్నాథపురాన్ని శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అక్కడ పెద్ద కోచింగ్ మెయింటెనెన్స్ డిపోతో పాటు, భారీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ. 2,800 కోట్లతో ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు పంపించారు.ఇదిలా ఉంటే.. విశాఖపట్నంలో రైల్వే యార్డును ఆధునీకరించడానికి డీపీఆర్ సిద్ధమైంది. ఇందులో 5 కొత్త లైన్లు, 10 స్టేబిలింగ్ లైన్లు, అదనపు ప్యాసింజర్ ప్లాట్‌ఫారాలు, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని బోర్డుకు ప్రతిపాదించారు. వీటితో పాటుగా ఫ్లైఓవర్లు, బైపాస్‌లు, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌లను కూడా నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. ఇవన్నీ పూర్తయితే ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలోఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.




## కొత్త బాయ్‌ఫ్రెండ్‌ను పరిచయం చేసిన జబర్దస్త్ ఫైమా..






తెలుగు బుల్లితెరపై గతంతో పోలిస్తే ఇప్పుడు ఎంతో మంది టాలెంటెడ్ అమ్మాయిలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అయితే, వారిలో కొద్దిమంది మాత్రమే భారీ ఫాలోయింగ్‌ను సంపాదించి వరుస ఆఫర్లతో దూసుకెళ్తున్నారు. అలాంటి వారిలో జబర్దస్త్ ఫైమా ఒకరు. చాలా తక్కువ సమయంలోనే సెన్సేషన్‌గా మారిన ఈ లేడీ కమెడియన్.. ప్రస్తుతం కెరీర్‌తో పాటు పర్సనల్ లైఫ్ కారణంగా కూడా వార్తల్లో నిలుస్తోంది.

టీనేజ్‌లోనే 'పటాస్' షో ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఫైమా.. ఆ తర్వాత 'జబర్దస్త్' షోలో తనదైన కామెడీ టైమింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. కొద్ది కాలంలోనే సెలెబ్రిటీ స్టేటస్‌ను అందుకున్న ఈ అమ్మడు.. అనేక షోలు, ఈవెంట్లలో పాల్గొంటూ బిజీగా మారింది. జబర్దస్త్ ఫైమా బిగ్ బాస్ సీజన్ 6లో కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆటతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ కూడా అందిస్తూ ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫినాలే ముందు ఎలిమినేట్ అయినప్పటికీ, షో తర్వాత ఆమె క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. బిగ్ బాస్ తర్వాత ఫైమాకు వచ్చిన ఫాలోయింగ్‌కు తగ్గట్టుగానే ఆఫర్లు కూడా భారీగా వచ్చాయి. ఈ క్రమంలోనే స్టార్ మా లో ప్రసారమైన 'బీబీ డ్యాన్స్' షోలో సూర్యతో కలిసి విజేతగా నిలిచింది. ఆ తర్వాత స్టార్ మా ఈవెంట్లలో తరచూ కనిపిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఫైమా పర్సనల్ లైఫ్ కూడా ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటుంది. 'పటాస్' రోజుల నుంచే ప్రవీణ్‌తో ప్రేమాయణం సాగించిందనే ప్రచారం జరిగింది. అయితే, ఆ వార్తలను ఫైమానే ఖండిస్తూ.. తాను అతడిని ఎప్పుడూ ప్రేమించలేదని స్పష్టం చేసింది.

అయితే ఈ అమ్మడు గత కొద్ది రోజులుగా ప్రవీణ్ నాయక్ అనే వ్యక్తితో ప్రేమలో ఉందని జోరుగా ప్రచారం జరిగింది. ఎట్టకేలకి దానికి ఇప్పుడు చెక్ పెట్టింది. మాల్‌లో అతని బర్త్ డే సెలబ్రేషన్స్ గ్రాండ్‌గా నిర్వహించింది ఫైమా. అందుకు సంబంధించిన పిక్స్ షేర్ చేయగా, ఇవి వైరల్‌గా మారాయి. ఈ పిక్స్‌లో ఫైమా తన ప్రియుడికి పలు గిఫ్ట్స్ కూడా ఇచ్చినట్టు అర్థమవుతుంది.

## రాజాసాబ్ పార్ట్ 2 కన్ఫర్మ్.. మారుతీ





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'ది రాజాసాబ్' పై అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కామెడీ సినిమాల దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మారుతీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. భారీ గ్రాఫిక్స్, పాన్ ఇండియా స్థాయి మేకింగ్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ముఖ్యంగా ఇటీవల విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచేసింది. దీంతో ఈ సినిమా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందా అని ప్రభాస్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే 'ది రాజాసాబ్' ప్రమోషన్లను మేకర్స్ ప్రారంభిం చారు. చిత్ర బృందం వరుసగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమాపై ఆసక్తికర విషయాలను పంచుకుంటోంది. ఈ నేపథ్యం లో దర్శకుడు మారుతీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొనగా, అనుకోకుండా సినిమాకు సంబంధించిన ఓ పెద్ద అప్డేట్ బయటపెట్టాడు. ఆ ఇంటర్వ్యూలో యాంకర్ 'ది రాజాసాబ్' ట్రైలర్‌లో ప్రభాస్ జోకర్ లుక్‌లో కనిపించిన విషయం గురించి ప్రశ్నించాడు. సాధారణంగా ఐకానిక్ క్యారెక్టర్లను మళ్లీ చేయడానికి స్టార్ హీరోలు ముందుకు రారని, అలాంటిది ప్రభాస్‌ను ఆ లుక్‌కు ఎలా ఒప్పించారు అని అడిగాడు. దీనికి సమాధానంగా మారుతీ మాట్లాడుతూ, "ప్రభాస్ జోకర్ లుక్‌లో కనిపించడానికి పెద్ద కథే ఉంది. ఆ కథ మొత్తం ది రాజాసాబ్ పార్ట్ 2లో ఉంటుంది. ఆ లుక్‌కు ఉన్న ప్రాధాన్యతను ప్రభాస్‌కు వివరించాను, అప్పుడు ఆయన ఒప్పుకున్నారు" అంటూ చెప్పుకొచ్చాడు. ఈ మాటలతో మారుతీ అనుకోకుండా 'ది రాజాసాబ్'కు సీక్వెల్ కూడా ఉంటుందనే విషయాన్ని బయటపెట్టినట్లైంది. దీంతో ఈ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. ఇక ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న సినిమాలను చూస్తే, సీక్వెల్స్ విషయంలో ఆయన టాప్‌లో ఉన్నారని చెప్పుకోవచ్చు. ఇప్పటికే సలార్ 2, కల్కి 2 లాంటి భారీ చిత్రాలు లైన్‌లో ఉండగా, ఇప్పుడు ది రాజాసాబ్ 2 కూడా ఆజాబితాలో చేరడం ప్రభాస్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్‌లా మారింది. ఈ సీక్వెల్స్ ఎప్పుడు ప్రారంభమవుతాయో, థియేటర్లకు ఎప్పుడు వస్తాయో ఇంకా స్పష్టత లేకపోయినా, ఈ అప్డేట్స్ మాత్రం అభిమాను లకు మంచి కిక్ ఇస్తున్నాయి. మొత్తంగా 'ది రాజాసాబ్' ఒక్క సినిమాగా మాత్రమే కాకుండా, ఓ ఫ్రాంచైజీగా మారే అవకాశాలు ఉన్నాయన్న మాట ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## రజనీతో కమల్ మూవీ

### డైరెక్టర్‌గా శిబి చక్రవర్తి

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. 'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని రాసుకొచ్చింది. కమల్ సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు.

ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అంతకుముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు. దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.


## భర్తతో సమంత హ్యాపీ మూడ్..





టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల తన వ్యక్తిగత జీవితంతో పాటు ప్రొఫెషనల్ కెరీర్‌లోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. గతేడాది ఆమె ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. కోయంబత్తూరులోని ఈషా యోగా సెంటర్‌లో లింగ భైరవి ఆలయం సన్నిధిలో, అత్యంత సింపుల్‌గా ఈ వివాహం జరగడం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరైన ఈ పెళ్లి, సమంత తీసుకున్న స్పిరిచువల్ నిర్ణయానికి ప్రతీకగా నిలిచింది. పెళ్లి తర్వాత తొలి న్యూ ఇయర్‌ను సమంత-రాజ్ జంట ప్రత్యేకంగా జరుపుకుంది. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ఈ జంట పోర్చుగల్ రాజధాని లిస్బన్‌కు వెళ్లింది. అక్కడి నుంచి సమంత సోషల్ మీడియాలో పంచుకున్న ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా న్యూ ఇయర్ సెలబ్రేషన్‌కు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఆ వీడియోలో సమంత ఎంతో ఆనందంగా, నవ్వుతూ కనిపించడంతో పాటు, భర్త రాజ్‌తో కలిసి కొత్త ఏడాదిని గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పిన తీరు అభిమానులను ఫిదా చేస్తోంది. ఈ వీడియోపై నెటిజన్లు భారీగా స్పందిస్తున్నారు. "సామ్ ఇలా హ్యాపీగా ఉండటం చూడటం చాలా ఆనందంగా ఉంది" అంటూ కామెంట్స్ చేస్తూ, ఆమెకు న్యూ ఇయర్ విషెస్ చెబుతున్నారు. పెళ్లి తర్వాత సమంత జీవితంలో వచ్చిన పాజిటివ్ చేంజ్ స్పష్టంగా కనిపిస్తోందని కూడా చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఇక కెరీర్ పరంగా కూడా సమంత ఫుల్ బిజీగా ఉంది. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా ముందడుగు వేసిన ఆమె, 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో ప్రధాన పాత్ర పోషించడంతో పాటు స్వయంగా నిర్మిస్తోంది. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో గుల్షన్ దేవయ్య, గౌతమి, దిగంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దీనితో పాటు బాలీవుడ్‌లోనూ సమంత హవా కొనసాగుతోంది. రాజ్-డీకే ద్వయం తెరకెక్కిస్తున్న భారీ పీరియడికల్ వెబ్ సిరీస్ 'రక్త బ్రహ్మాండం' లో సమంత కీలక పాత్రలో కనిపించనుంది. ఆదిత్య రాయ్ కపూర్, అలీ ఫజల్, వామికా గబ్బి వంటి స్టార్స్‌తో కలిసి ఆమె నటిస్తుండటం విశేషం.

## రెండో పెళ్లి చేసుకోబోతున్న బోల్డ్ బ్యూటీ..!



ఇటీవల కాలంలో చాలా మంది పచ్చని కాపురాన్ని నాశనం చేసుకుంటూ విడాకులు తీసుకుంటున్నారు. చిన్న చిన్న గొడవలకే విడిపోతూ.. ఎవరి లైఫ్ వాళ్లు చూసుకుంటున్నారు. ఆ తర్వాత రెండో పెళ్లిళ్లు చేసుకుంటూ లైఫ్‌ని అక్కడితే ఆపేయకుండా ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇదే ట్రెండ్ ఫాలో అవుతున్నారు చాలామంది సినీ సెలబ్రిటీలు. ఇక ఇప్పుడు ఓ బోల్డ్ బ్యూటీ కూడా ఇదే ఫాలో అవుతున్నట్లు తెలుస్తోందిజ బాలీవుడ్ నటి కీర్తి కుల్హారి మొదటి భర్తతో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. సాహిల్ సెహగల్‌ను పెళ్లి చేసుకున్న

ఆమె ఐదేళ్ల వైవాహిక జీవితానికి స్వస్తి పలికింది. 2021లో భర్తతో విడాకులు తీసుకుంది. ఇక అప్పటినుంచి నటుడు రాజీవ్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్నాయి. వీరిద్దరు త్వరలో పెళ్లి కూడా చేసుకోబోతున్నారంటూ పలు పుకార్లు షికారు చేస్తున్నాయి. తాజాగా, ఈ విషయంపై కీర్తి కుల్హారి స్పందించి అధికారిక ప్రకటనతో పుకార్లకు చెక్ పెట్టింది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ స్పెషల్ వీడియోను షేర్ చేసింది. ఇందులో తన ప్రియుడు రాజీవ్‌తో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంది. కారులో తీసుకున్న సెల్ఫీలు, కలిసి చేసిన ప్రయాణాలు, లిఫ్ట్‌లో దిగిన క్యూట్ ఫొటోలతో పాటు రాజీవ్ నుదుటిపై ముద్దు పెట్టింది. ఈ వీడియో చివరలో కిటికీపై బాణం గుర్తుతో ఉన్న హార్ట్ సింబల్‌ను చూపిస్తూ తన ప్రేమను అందరికీ తెలిసేలా చేసింది. "ఒక చిత్రం వెయ్యి మాటల కంటే గొప్పది" అనే క్యాప్షన్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు కన్ఫర్మ్ చేసింది. ఈ పోస్ట్ చూసిన వెంటనే వారి సహనటులు, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ కంగ్రాట్స్ చెబుతున్నారు. మరికొందరు మాత్రం షాక్ అవుతున్నారు. కాగా.. రాజీవ్, కీర్తి 'ఫోర్ మోర్ షాట్స్ ప్లీజ్!' అనే వెబ్‌సిరీస్‌లో జోడీగా నటించిన విషయం తెలిసిందే. ఇక ఇందులో అంజనా, మిహిర్ పాత్రలో కనిపించగా.. ప్రేక్షకుల్లో మంచి ఆదరణ లభించింది. అంతేకాకుండా వీరికి పాపులారిటీ పరంగా ప్లస్ అయింది. ఇక ఈ సిరీస్ షూటింగ్ మొదలైనప్పటి నుంచి వీరిద్దరు తమ రిలేషన్‌ను సీక్రెట్‌గా మెయిన్‌టేన్ చేస్తున్నట్లు టాక్.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215